విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శనివారం 04 అక్టోబరు 2025 8 పేజీలు



స్వచ్ఛాంధ్ర అవార్డులు

ఏలూరు జిల్లాకు 2 రాష్ట్ర స్థాయి, 51 జిల్లా స్థాయి అవార్డులు : కలెక్టర్ వెట్రి సెల్వి

విశాలాంధ్ర - ఏలూరు: జిల్లాలో అత్యుత్తమ స్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించినందుకు 2 రాష్ట్రస్థాయి,51 జిల్లా స్థాయి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర 2025 అవార్డులు సాధించామని కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో జిల్లా సాధించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర 2025 అవార్డుల వివరాలను గురువారం పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ▶మిగతా 2లో..

ఎన్ఆర్జీఎస్ పనులపై ప్రత్యేక దృష్టి

- సకాలంలో పూర్తి చేయాలి
- కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో ఎన్ఆర్జీఎస్ నిధులతో చేపట్టిన పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో పిఠాపురం నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న పనులపై జిల్లా కలెక్టర్ షణ్మోహన్, పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ అధికారులు, డ్వామా, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీసీ రోడ్లు, డ్రైన్లు, మినీ గోకులాలు, నీటి కుంటలు, కాంపౌండ్ వాల్, ఇతర పనుల పురోగతి, పని దినాల సంఖ్య వంటి అంశాలపై ఆయన అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ పిఠాపురం, గొల్లప్రోలు, యు కొత్తపల్లి మండలాల పరిధిలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైన్లు, మినీ గోకులాలు, నీటి కుంటలు, కాంపౌండ్ వాల్ ఇతర పనులు చేపట్టినట్టు తెలిపారు. అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ఈ పనులన్నింటిని సకాలంలో పూర్తి చేయాలన్నారు. మండలాల వారిగా నిర్దేశించిన లక్ష్యానికి అనుగు ణంగా అధికారులు పనులలో పురోగతి కనపరచా లన్నారు. పనులు పూర్తి చేసి బిల్లులు అప్లోడ్ చేయని వాటి వివరాలు నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ పూర్తయిన వెంటనే కాలుగులకు పూడిక తీత, వీడ్ రిమువర్ పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఆయన ▶మిగతా 2లో..

అవినీతికి అడ్డాగా కొవ్వూరు మున్సిపాలిటీ

- దోచుకున్న వారికి దోచుకున్నంత
- వైసీపీ, టీడీపీ దొందూ దొందే
- శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు లేకపోవడం శోచనీయం
- కాసులు కురిపిస్తున్న పిచ్చిమొక్కలు, సిల్టుతీత

విశాలాంధ్ర - కొవ్వూరు : కొవ్వూరు మున్సిపాలిటీలో అవినీతి రాజ్యమేలుతోంది. ఇక్కడ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వైసీపీ, టీడీపీ కూటమిగా ఏకమయ్యాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ గత వైసీపీ ప్రభుత్వంలో పాలన చేపట్టింది. ఇప్పుడు రాష్ట్రంలో ప్రభుత్వం మారినా కూటమిలు మారినా తెదేపా మాత్రం వైసీపీతో ఇంకా మిత్రత్వంగానే ఉంది. అడపాదడపా జనసేనపై వైరం బట్టబయలవు తున్నా వైసీపీతో మాత్రం ఏ విధమైన వైరం చూపించలేకపోవడం వీరి కలయిక పటిష్టతకు నిదర్శనంగా భావిస్తున్నారు. చైర్మన్‌తో పాటు కొంతమంది కౌన్సిలర్లు తెదేపా తీర్థం పుచ్చుకున్నా తెదేపా జెండా మాత్రం మున్సిపాలిటీపై ఎగరలేదు. నిడదవోలులో ఒక్క స్థానం కూడా లేకపోయినా నిడదవోలు మున్సిపాలిటీపై జనసేన జెండా రెపరెపలాడింది. అక్కడ మంత్రి చాణిక్యం చూపారు. ఇక్కడ మాత్రం ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు అవకాశం ఇవ్వలేదు. ఇరు పార్టీలు కలిసి మున్సిపల్ సొమ్మును ఏ విధంగా దోచుకోవాలో ఆ విధంగా ఇక్కడ ప్రణాళికలు రచిస్తూ ఆమోదయోగ్యంగా మారుస్తున్నారని ప్రజలు చెప్పుకుంటున్నారు ఏ విధమైన పనులు చేయకుండా నామినేషన్ల పేరుతో ప్రజాధనాన్ని కొట్టేస్తున్నారు. ఎజెండాలో తీర్మానాలు చేయటం వాటిని కౌన్సిల్లో ఆమోదించటం తద్వారా ఆ సొమ్మును ప్రజాప్రతినిధులు దోచేస్తున్నారని సర్వత్రా ▶మిగతా 2లో..

10న పెన్షన్ అదాలత్

విశాలాంధ్ర -భీమవరం: భీమవరంలో అక్టోబర్ 10న నిర్వహించనున్న "పెన్షన్ అదాలత్" కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతి ప్రియ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "పెన్షన్ అదాలత్ - ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎట్ యువర్ డిస్ట్రిక్ట్" కార్యక్రమాన్ని జిల్లాల వారీగా చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల డ్రాయింగ్ ఆఫీసర్లకు, పెన్షన్ మంజూరు అధికారులకు మార్గనిర్దేశం చేయడం, ఉద్యోగులు, పెన్షనర్ల పెన్షన్ ప్రతిపాదనలను సకాలంలో, సరైన రీతిలో సమర్పించడం గురించి అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. దీని కారణంగా పదవీ విరమణ తేదీకి ముందే పెన్షనర్ ప్రయోజనాలను అధికారం పొందేలా చేస్తుందన్నారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పెన్షనర్లు, డిడిఓల అభ్యర్ధన మేరకు, ఈ కార్యక్రమాన్ని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో అక్టోబర్ 10వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

జీఎస్టీపై అవగాహన కల్పించాలి

అధికారులతో కలెక్టర్ కె. వెట్రిసెల్వి టెలి కాన్ఫరెన్స్

విశాలాంధ్ర-ఏలూరు: సూపర్ జీఎస్టీ...సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ఎంఎస్ఎంఈ వర్తకులు, వినియోగదారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి శుక్రవారం సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో రెండవ వారం చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం నిర్వహణాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫెరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజలు వినియోగించే నిత్యావసర సరుకులపై ఏ మేరకు జీఎస్టీ తగ్గింపుతో ఏ మేరకు లబ్ది కలుగుతుందో ప్రతీ కుటుంబానికి తెలియజేయాలన్నారు. ఇందుకోసం ప్రచురించిన కరపత్రాలను గ్రామ/వార్డు సచివాలయ స్థాయిలో ప్రతీ కుటుంబానికి అందించి, జీఎస్టీ 2.0 కింద ▶మిగతా 2లో..

గాంధీ ఆశయాలకు తిలోదకాలు

- విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- పట్టించుకోని అధికారులు
- మాంసం, చేపల అమ్మకాల జోరు

విశాలాంధ్ర -కాట్రేనికోన : అక్టోబర్ 2 గాంధీ జయంతి అన్న విషయం అందరికీ తెలిసిందే. గాంధీ మహాత్ముని ఆశయం మేరకు ఆయన జయంతి రోజున మద్యం విక్రయాలు, మాంసం, చేపల అమ్మకాలను ప్రభుత్వం నిషేధించినా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. కాట్రేనికోన మండలంలో గురువారం గాంధీ జయంతి రోజునే బ్రాందీ విక్రయాలు జోరుగా సాగాయి.

పేరుకు ముందు రోజునే ప్రభుత్వ లైసెన్స్ బ్రాందీ షాపులకు సీళ్లు వేసినా భారీగా మద్యంను బుధవారం పగలే అక్రమ వ్యాపారులు తరలించేశారు. వీరికి ప్రభుత్వ లైసెన్స్ షాపుల ద్వారానే సజావుగా మందు అందింది. మండలంలోని కాట్రేని కోన, చెయ్యేరు, పల్లంకుర్రు, కందికుప్ప తదితర గ్రామాల్లోని లైసెన్స్ షాపుల నుండి యథేచ్ఛగా మందు సరఫరా అవ్వడంతో ఆయా గ్రామాల్లోని బెల్ట్ షాపుల్లో బహిరంగంగా అధిక ధరలకు విక్రయాలు సాగాయి.

తీర గ్రామాలైన పల్లం, బలుసుతిప్ప, చిర్రయానం, మొల్లేటిమగ, కొత్తపాలెం తదితర తీర గ్రామాలలోనూ అనధికార మద్యం షాపుల్లో ఎప్పటిలాగే బ్రాందీ అమ్మకాలు అడ్డు అదుపు లేకుండా చేసారు. దీనికి దసరా తోడు కావడంతో మద్యం ప్రియులు మరింత రెచ్చిపోయారు. గ్రామాల్లో తాగుబోతులు వీరంగం చేశారు. వీరి బలహీనతను ఆసరాగా చేసుకుని అక్రమ వ్యాపారులు సొమ్ము చేసుకున్నారు. గాంధీ జయంతి రోజునే బహిరంగ మద్యం విక్రయాలు సాగినా ఎక్సైజ్ అధికారులు వాటి వైపు కన్నెత్తి చూడలేదు. గ్రామాల్లో తనిఖీలు లేవు. పోలీసులు పట్టనట్లు వ్యవహరించారు. సిండికేట్‌ల ఆధీనంలో పనిచేస్తున్న ముమ్మిడివరం ఎక్సైజ్ శాఖ పట్టించుకోవడంలేదని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

కనీసం గ్రామాల్లో మాంసం, చేపల విక్రయాలు బహిరంగంగా సాగినా గ్రామపంచాయతీ అధికారులు చోద్యం చూశారు తప్ప అరికట్టలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేనా జాతిపిత గాంధీ మహాత్మునికి నివాళి అని పౌరజనాలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

పెట్రోలియం కమిటీలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు: కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖల వ్యవహారాలను పరిశీలించే పార్లమెంటు స్థాయి సంఘాలను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పునర్వ్య వస్థీకరించారు. పెట్రోలియం, సహజవాయువుల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ నియమితులయ్యారు.

కీలకమైన పెట్రోలియం సహజ వాయువుల స్థాయి సంఘంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌తో పాటు మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరికి కూడా చోటు దక్కింది. ఈ మేరకు వివిధ పార్లమెంటరీ కమిటీలకు సభ్యులను నియమించిన విషయాన్ని తెలియచేస్తూ పార్లమెంటరీ సెక్రటరీ జనరల్ కెవస్ సోమశేఖర్ జాబితా విడుదల చేశారు. గతంతో పోల్చితే ఈసారి కేంద్ర ప్రభుత్వంలో వివిధ కమిటీలలో టీడీపీకి ఎక్కువ ప్రాధాన్యం లభిస్తుండటం విశేషం.

నీట్ ర్యాంక్ సాధించిన నిషిత

విశాలాంధ్ర-మండవల్లి: మండవల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన తొండమల్లి నిషిత నీట్ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో 3951 ర్యాంకు సాధించింది. బీసీ కాలనీలో నిషిత, ఆమె తల్లి లక్ష్మీలను గురు వారం టీడీపీ నాయ

కులు శాలువాలతో ఘనంగా సన్మానిం చారు. కోటేశ్వరరావు, లక్ష్మీ చేతి వృత్తి బార్బర్ షాపు నిర్వహిస్తూ పిల్లలను చదివించారు. పెద్ద కుమార్తె నిషిత పదో తరగతిలో 600లకు 600 మార్కులు, ఇంటర్‌లో 1000కి 909 మార్కులు సాధించడమే కాక నీట్‌లో మంచి ర్యాంకు సాధించింది. చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించి గ్రామానికి పేరు, ప్రఖ్యాతలు సాధించిందని టీడీపీ నాయకులు ముళ్లపూడి సత్తిబాబు, గుడివాడ గణేష్, వీరవల్లి శివయ్య పేర్కొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం: నాణ్యత ప్రమాణాలు పాటించి రోడ్లు వేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడిగడప జయరాజు డిమాండ్ చేశారు. ఇటీవల నూతనంగా వేసిన అల్లంచర్ల రాజు పాలెం రోడ్డును శుక్రవారం ఆయన పరిశీలిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

కేతవరం అల్లం చర్ల రాజు పాలెం, కొత్త గూడెం గ్రామాల మీదుగా కామవరపుకోట వెళ్ళే రోడ్డు నాణ్యత ప్రమా ణాలు పాటించకుండా రోడ్డు వేసారని తెలిపారు.

రోడ్డు వేసి నెల రోజులు గడవక ముందే వాహనాలు తిరుగుతుంటే పెచ్చులు లేచిపోతున్నారని అన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా రోడ్డు వేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రజా ధనం వృథా అవుతుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తు న్నారని అన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించ కుండా రోడ్డు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రత్యేక దృష్టి (1వ పేజీ తరువాయి)

తెలిపారు. డ్వామా, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, పాడా అధికారులు సమన్వయంతో పనిచేసి లక్ష్యానికి అనుగుణంగా పర్కులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో ఇన్‌చార్జి పాడా పీడీ పి. వేణుగోపాలరావు, ఏపీడీ వసంత మాధవి, పంచాయతీరాజ్ ఎస్‌ఈ ఏవీఎస్ శ్రీనివాసు, డ్వామా ఏవో, పిఠాపురం గొల్లప్రోలు, యు. కొత్తపల్లి మండలాల ఎంపీడీవోలు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

(1వ పేజీ తరువాయి)

ఏ వస్తువుపై ఏ మేరకు తగ్గింపు వర్తిస్తుందో తెలియజేసి, వారు వినియోగించుకునేలా అవగాహన కలిగించాలన్నారు.సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై జిల్లాలో నాలుగు వారాల పాటు ప్రతీ వారం ఒక థీమ్ తీసుకుని ప్రజలకు అవగాహన కలిగించనున్నట్లు తెలిపారు. ఈనెల 4వ తేదీన 'ఆటో డ్రైవర్ సేవలో' కార్యక్రమం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించనున్న దృష్ట్యా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ఘనంగా పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లాకు రెండు రాష్ట్ర స్థాయి అవార్డులు, జిల్లా స్థాయిలో 51 అవార్డులు లభించాయన్నారు.

జిల్లా స్థాయిలో నిర్వహించే అవార్డుల ప్రదానం కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రి,పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉన్నందున కార్యక్రమం నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ నాగార్జునరావు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీ

(1వ పేజీ తరువాయి)

విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. ప్రతిపక్షం లేక ప్రశ్నించే వాళ్లే లేకపోవటమే దీనికి నిదర్శనంగా భావించవచ్చు. గోదావరి బండపై పిచ్చి మొక్కల పేరుతో ఏటా నాలుగు నుంచి ఐదు లక్షల వరకు డబ్బును వృధా చేస్తున్నారు.

వివిధ వ్యక్తుల పేరుతో నామినేషన్ పద్ధతిలో కేటాయిస్తూ పిచ్చి మొక్కలు అని చెబుతూ ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారు. ఈ పిచ్చి మొక్కలు మున్సిపల్ ప్రజా ప్రతినిధులకు, అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి.

ఈ పిచ్చి మొక్కలపై గత ఐదారు సంవత్సరాల నుండి ఎన్ని డబ్బులు బిల్లుల రూపంలో బొక్కేసారో మున్సిపల్ పై అధికారులు, జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యమంత్రి కొవ్వూరు రాకపోయినా వచ్చినట్లుగా నిధులు దుర్వినియోగం చేస్తూ బిల్లులు కూడా పెట్టేశారు.... చెప్పుకుంటూ పోతే ఎన్నో అవకతవకలు బయట పడుతూనే ఉన్నాయి.

ఈ మున్సిపాలిటీకి సరైన అడ్మినిస్ట్రేషన్ లేదు. ఒక వివాదం లో చిక్కుకొని కమిషనర్ సస్పెన్షన్‌కు గురైనా తిరిగి ఇక్కడ ఫుల్ టైం కమిషనర్‌ను నియమించక పోవడం విమర్శలకు దారి తీస్తున్నది. ఈ మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేరు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లేరు. సరైన విభాగాల్లో అధికారులు లేకపోవడం కూడా అవినీతి రాజ్యమేలటానికి అడుగులు వేశాయి.

కొవ్వూరు మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో పాలన అయోమయంగా మారింది. పట్టణంలో పరిశుభ్రత కావాలంటే శానిటరీ ఇన్‌స్పెక్టర్ కచ్చితంగా ఉండాలి. ఆయన స్థానంలో ఒక ఇన్‌చార్జి ఉద్యోగి బాధ్యతలు చేస్తున్నారు.

ఇక ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లేదు. దీంతో పట్నంలో పారిశుధ్యం పడకేసింది. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో నాణ్యత చూసేవాడే కరువయ్యాడు. వ్యాపార సంస్థలు ఎన్ని రంగులు కలిపినా, నిల్వ మాంసాన్ని ఫ్రిజ్లో పెట్టి మరునాడు విక్రయిస్తున్నా పర్యవేక్షించే అధికారే కరువయ్యాడు. దీంతో పట్టణ ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు.ఒకవైపు రెవెన్యూ డివిజన్ కేంద్రం కావడం, మరోవైపు నియోజకవర్గ హెడ్ క్వార్టర్‌గా ఉండడంతో స్థానిక ఎమ్మెల్యే అందుబాటులో ఉంటారు. అయినా ఇటువంటి పరిస్థితులు అటు మున్సిపాలిటీలోనూ ఇటు పట్టణంలోనూ ఏర్పడుతుంటే ఎవరికి చెప్పుకోవాలి అంటూ ప్రజలు వాపోతున్నారు.

నామినేషన్ పద్ధతి అంటేనే పాలకులకు మోజు

మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చాలావరకు పు రపాలకులు కేటాయిస్తున్నారు.

ఐదు లక్షల వరకు నామినేషన్ పద్ధతిలో ఇవ్వవచ్చునన్న నిబంధన ఉండడంతో పలు పనులను రెండు లేక మూడు విధాలుగా విభజించి పనులు అప్పచెబుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా తాడేపల్లిగూడెంకు చెందిన ఒక కాంట్రాక్టర్కు పిచ్చి మొక్కలు తీయడం, మేజర్ డ్రైన్లలో సిల్టు తీయడం వంటి పనులు పాలకులు శ్రద్ధగా అప్పగించడం కూడా విమర్శలకు తావిస్తోంది.

అవార్డులు

(1వ పేజీ తరువాయి)

చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్ర మంలో జిల్లాలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, బహిరంగ ప్రదేశాలలో పరిశు భ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం పునర్వినియోగం తగ్గించు రీసైకిల్, స్థిరమైన పద్ధతులలో కొత్త ప్రమాణాలతో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించినందుకు 2 రాష్ట్రస్థాయి, 51 జిల్లా స్థాయి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర -2025 అవార్డులు సాధించామన్నారు.

జిల్లాలో స్వచ్ఛాంధ్ర అవార్డులకు, 17 విభాగాలలో 1,20,057 కేంద్రాలు పాల్గొనగా, 1317 జిల్లా స్థాయి నామినేషన్లు ఎంపికయ్యాయని, చివరికి 62 రాష్ట్ర స్థాయి అవార్డులకు పోటీ పడ్డారన్నారు. వాటిలో రాష్ట్ర స్థాయిలో 2 అవార్డులు, జిల్లా స్థాయిలో 51 అవార్డులు సాధించామన్నారు. రాష్ట్ర స్థాయి అవార్డుగ్రహీతలకు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ఈనెల 6వ తేదీన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో అవార్డులు ప్రదానం జరుగుతుందన్నారు. అదేరోజు జిల్లాస్థాయి ఏలూరులో స్వచ్ఛ ఆంధ్ర అవార్డులను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ప్రజా ప్రతినిధులు, అధికారుల సమక్షంలో అవార్డులు అందించి సత్కరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి,ప్రభృతులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

విశాలాంధ్ర - లింగపాలెం : అనాథలు, పేదలు, దివ్యాంగులైన విద్యార్థులకు రంగాపురంలోని సెయింట్ జోన్స్ ఒకేషనల్ కేంద్ర వ్యవస్థాపకులు, ఆస్ట్రియా దేశంలో క్రైస్తవ సేవ చేస్తున్న రెవరెండ్ ఫాదర్ కాట్రు యోహాను ఆర్థిక సాయం అందిం

చారు.ప్రాథమిక స్థాయి విద్య నుంచి పీజీ ఆ పైచదువులు చదివే పేదలు, అనాథలు, దివ్యాంగులైన విద్యార్థులను గుర్తించి పది ఏళ్లుగా ఇటువంటి వారికి సాయం అందిస్తున్నారు. దీనిలో భాగంగా ఈఏడాది కాలానికి 70 మంది విద్యార్థులకు రూ.4.10లక్షలను చెక్కుల ద్వారా ఆర్థిక సాయాన్ని రంగాపురం ఒకేషనల్ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో అందించారు. విద్యార్థుల బట్టి సాయం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ముసునూరు రాము, మండల విద్యాశాఖ అధికారులు రామారావు, రవీంద్ర, ఒకేషనల్ కేంద్ర కరస్పాండెంట్ జాన్ రాజు పాల్గొన్నారు. ఫాదర్ యోహాను చేస్తున్న సేవలను సర్పంచ్, మండల విద్యాశాఖ అధికారులు కొనియాడారు.

మండల స్థాయి క్రీడా పోటీలు

విశాలాంధ్ర - లింగపాలెం: లింగపాలెం మండలంలో మండల స్థాయి క్రీడా పోటీలు ఈనెల 8,9 తేదీలలో సింగగూడెం ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్టు వ్యాయామ ఉపాధ్యాయులు, మండల కోఆర్డినేటర్ ప్రకాష్ రెడ్డి తెలిపారు. గత నెలలో జరగవలసిన పోటీలు వాయిదా పడ్డాయని అన్నారు. ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చు అని తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాలలో విద్యార్థులను గుర్తించి పోటీలు నిర్వహిస్తామని అన్నారు. ప్రధానమైన క్రీడలకు పోటీలు జరుగుతాయని తెలిపారు.

ధరల తగ్గుదల వ్యవసాయ రంగానికి ప్రయోజనం

విశాలాంధ్ర-లింగపాలెం: ప్రభుత్వం ధరలు తగ్గించడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగబోతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రదీప్ కుమార్ తెలిపారు. వ్యవసాయానికి వినియోగించే పరికరాలను 18 శాతం నుంచి 5శాతంకు తగ్గాయని తెలిపారు. ధరలు తగ్గుదలకు

సంబంధించి రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని లింగపాలెం మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. తగ్గిన ధరల వివరాలను ఈ ప్రదర్శనలో ఉంచారు. ధరలను వివరిస్తూ గ్రామంలో రైతులతో కలిసి అధికారులు ప్రదర్శన నిర్వహించారు. ధరలు తగ్గటం వల్ల వ్యవసాయం చేసే రైతులకు లాభం కలుగుతుందని వీటిని గమనించి రైతులు సద్వినియోగించు కోవా లని సహకార సంఘ అధ్యక్షులు మారంపూడి మల్లికార్జునరావు, గరిమెళ్ళ చలపతి వివరించారు. సర్పంచ్ హేమలత,డిప్యూటీ ఎంపీడీవో సుందరి, ఉద్యాన శాఖ అధికారి పర్విన్, ప్రకృతి వ్యవసాయ శాఖ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

విశాలాంధ్ర-మండవల్లి: రొయ్యల చెరువు వద్ద కూలిపనికి వెళ్లి విద్యుత్ షాక్ తగిలి యువకుడు మృతి చెందిన ఘటన మండవల్లి మండలం చింతపాడులో గురువారం వెలుగు చూసింది. దేవిచింతపాడుకు చెందిన భాను(25) కూలి పనులు చేస్తూ జీవిస్తుంటాడు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం రొయ్యల

చెరువుపై ఫ్యాన్ రెక్కలు బిగించేందుకు పనికి వెళ్లాడు. అక్కడ విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. భాను ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నాడు.

పోస్టాఫీసు పొదుపు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

విశాలాంధ్ర -భీమవరం: పోస్టాఫీసు పొదుపు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని, వీటిపై ప్రజల్లో అవగాహన కలిగించాలని జిల్లా వృత్తి విద్యాధికారి సీఎంఓ చంద్రశేఖర్ అన్నారు. గూట్ల పాడు హైస్కూల్ విద్యార్థులు పీఎంశ్రీ ఇంటర్న్‌షిప్‌లో శిక్షణ పొందుతున్న భీమవరం హెడ్ పోస్టాఫీసును జిల్లా అధికారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్ పొందుతున్న విద్యార్థులకు క్షేత్ర స్థాయిలో డిజిటల్ సేవల పైనా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కోర్సుల ద్వారా విద్యార్థులకు భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటా యన్నారు. తమ విద్యార్థులకు శిక్షణ కల్పిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్, భీమవరం హెడ్ పోస్టు మాస్టర్, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం ఆర్.సత్యవాణి, వీసీ సంజీవ, వీటీ మౌనిక, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమవరం మున్సిపాలిటీకి రాష్ట్ర స్థాయి అవార్డు

విశాలాంధ్ర -భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భీమవరం పురపాలక సంఘం రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి అవార్డు కైవసం చేసుకుంది. గాంధీజీ జయంతి పురస్కరించుకుని ప్రభుత్వం భీమవరానికి అవార్డు ప్రకటించింది. దీనిలో భాగంగా భీమవరం పురపాలక సంఘం కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రశాంతి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్, శ్రీ విజ్ఞాన్ వేదిక ఉత్తమ స్వచ్ఛతా ఎన్జీవోలుగా అవార్డులు పొందారు. మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అవార్డులు పొందడం సంతోషంగా ఉందన్నారు. పట్టణాభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తున్న ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, భీమవరం పురపాలక సంఘం ప్రత్యేకాధికారి, ఆర్డీఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, శానిటరీ సిబ్బందికి, పారిశుధ్య కార్మికులకు, స్వచ్ఛంద సంస్థలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆటో డ్రైవర్లకు అండగా కూటమి ప్రభుత్వం

ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఆదాయం తగ్గితే ఆటో డ్రైవర్లు ఇబ్బంది పడతారనే ఉద్దేశంతో వారిని ఆదుకునేందుకు తీసుకువచ్చిందే "ఆటో డ్రైవర్ల సేవలో" పథకం అని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. ఆటో డ్రైవర్లకు 15 వేలు ఆర్థిక సాయం అందించే పథకం ప్రారంభం సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇది దసరా పండగ సమయం అని, కొద్ది రోజుల్లో దీపావళి పండుగ కూడా రాబోతోందని, ఈ పండుగల సమయంలో ఆటో డ్రైవర్ల, క్యాబ్ డ్రైవర్ల కుటుంబాల్లో సంతోషం నింపేందుకు రూ.15 వేలు ఆర్థిక సాయం అందించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అక్టోబర్ 4 నుంచి "ఆటో డ్రైవర్ సేవలో" పథకం ప్రారంభించిందన్నారు. ఈ పండుగల సమయంలో ఆటో సోదరులంతా తమ కుటుంబ సభ్యులతో, బంధు మిత్రులతో ఈ సంతోషాన్ని పంచుకుంటూ, కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరుకుంటున్నానన్నారు.

జంగారెడ్డిగూడెంలో హత్య

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం బైనేరు వాగు సమీపంలో యాక్టివ్ అఫెండర్ కర్రి రాజేష్ పై శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు చేతులు, కాళ్లు కట్టి కత్తితో విచక్షణ రహితంగా దాడి చేయడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. వాగు సమీపంలో ఉన్న తుప్పల్లో అతని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. మరొక పాత నేరస్తులకు మధ్య కక్షల నేపథ్యంలో పోలీసులు ప్రాథమిక సమాచారాన్ని సేకరించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

జీఎస్టీ తగ్గింపుపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: ఎంఎస్ఎంఇ, చేనేత, హస్తకళల ఉత్పత్తులకు జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. సూపర్ జీఎస్టి, సూపర్ సేవింగ్స్ రెండవ వారం ప్రచార కార్యక్రమం అమలులో భాగంగా భీమవరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఎంఎస్ఎంఈ, చేనేత, హస్తకళల ఉత్పత్తుల ప్రదర్శనను శుక్రవారం జేసీ సందర్శించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్లో ప్రదర్శించిన టేకు చెక్కతో తయారుచేసిన ఎద్ల బండి, నాగలి, వివిధ దేవతామూర్తులు, చేనేత వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు, ప్యాకింగ్ మెటీరియల్ తదితర ఉత్పత్తులను పరిశీలించి జీఎస్టీ తగ్గింపునకు ముందు ప్రస్తుత ధరకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టి తగ్గింపు ప్రచార కార్యక్రమాల్లో భాగంగా రెండవ వారం అక్టోబర్ మూడు, నాలుగు తేదీల్లో జిల్లా అంతటా ఎంఎస్ఎంఈ, చేనేత, హస్తకళల ఉత్పత్తుల ప్రదర్శనలను ఏర్పాటుచేసి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. జీఎస్టీ తగ్గింపు ద్వారా పేద, మధ్యతరగతి వర్గాలకు కుటుంబానికి సుమారు నెలకు 2,500 నుండి 5 వేల వరకు ఆదా అవ్వడంతో పాటు వ్యాపారాలు కూడా పెరుగుతాయని అన్నారు. ఈ సందర్భంలో డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, వాణిజ్య పన్నుల డిప్యూటీ కమిషనర్ కె.పి.శైలజ , జిల్లా పరిశ్రమల అధికారి యు.మంగపతిరావు తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన జీఎస్టీపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇటీవల కాలంలో తగ్గించిన జీఎస్టీ ధరలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జీఎస్టీ కమిషనర్ రసజ్ఞ పేర్కొన్నారు. స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపం వద్ద చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులకు జీఎస్టీ ధరలు తగ్గింపు పై అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా రసజ్ఞ మాట్లాడుతూ అన్ని రకాల వస్తువులపై జీఎస్టీ ధరలు తగ్గిం చారని, ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన కలిగి ఉండాలని పలు సూచనలను వ్యాపారస్తులకు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మద్దు మోహన్, గొలిశెట్టి శ్రీనివాస్, కర్పూరపు సత్యనారాయణ, కంభం పాటి రాంబాబు, కొల్లూరు శ్రీనివాస్, గద్దం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మార్గం అజేయం

విశాలాంధ్ర-తణుకు : స్వాతంత్ర్య సమరయోధుల పార్కులో ప్రతిష్ఠించిన గాంధీజీ విగ్రహం ఈ ప్రాంత ప్రజలకు, భావితరా లకు నిరంతర స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తుందని విగ్రహావిష్కరణ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఈ పార్కును జాతీయో ద్యమ సాంస్కృతిక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి తన సహకారంతో పాటు ప్రభుత్వపరంగా, మున్సిపాలిటీ సహకారాన్ని అందిస్తామని ప్రకటిం చారు. తొలుత జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్క రించారు. గాంధీజీ విగ్రహ ప్రదాతలైన స్వాతంత్ర్య సమరయోధులు సంకు అప్పారావు కుమార్తె సంకు మనోరమ, డివివియన్ వర్మ దంపతులను ఆయన అభినందించి సన్మానించారు. గాంధీజీ విగ్ర హాన్ని ఆవిష్కరించిన సంకు మనోరమ మాట్లాడుతూ నేటి దేశ పరిస్థితుల్లో గాంధీజీ భావజాలమే పరిష్కార మని, ఆ స్ఫూర్తిని అందిపుచ్చు కోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమం ముగిసిన అనంతరం జరిగిన సభకు అధ్యక్షత వహించిన డివివియన్ వర్మ మాట్లాడుతూ 'సత్యం - అహింసల' అజేయ మార్గాన్ని గాంధీజీ దేశానికి, ప్రపంచానికి అందించిన యోధుడు అన్నారు.. ఈ కార్యక్రమానికి పూర్తి సహకారాన్ని అందిం చిన శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణకు, సహకారం అందించిన మున్సిపల్ కమిషనర్ రాంకుమార్, డిఇ ఈశ్వర రెడ్డికి, సమ న్వయ కర్తగా వ్యవహరించిన బెల్లం కొండ బుచ్చిబాబుకు కృతజ్ఞతలు ప్రకటిం చారు. గాంధీజీ భావజాల ప్రచారానికి విశేష కృషి చేసిన డాక్టర్ తాతిన రామబ్రహ్మం, డాక్టర్ వత్సవాయి వెంకటరాజు, డాక్టర్ చెలికాని స్టాలిన్ (రామచంద్రపురం)తమ సందేశాలలో భావితరాలకు గాంధీజీని పరిచయం చేసే కార్యకలాపాలు నిరంతరం జరగాలని కోరారు. స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబ సభ్యులు యర్రమిల్లి విజయలక్ష్మి, చల్లా హైమావతి, భూపతిరాజు రమేష్ చంద్రబాబు సందేశా లివ్వగా నడిపల్లి రాంబాబు, డాక్టర్ రామ దాసు డాక్టర్ వసుంధర, సంకు సూర్య కుమారి, రామారావు, సంకు విజయ కుమార్, భూపతిరాజు ఝాన్సీ, సీతారామ రాజు పాల్గొన్నారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు పి.హరికుమార్‌రాజు, సీపీఐ నాయకులు కోనాల భీమారావు, సీపీఎం నాయకులు పీవీ ప్రతాప్, టీడీపీ నాయకులు పి.మారుతీరావు మాట్లాడారు. పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

గాంధీమార్గం అనుసరణీయం

విశాలాంధ్ర - ఏలూరు: అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహాత్మాగాంధీ జీవితం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. గాంధీ జయంతి సంద ర్భంగా గురువారం స్థానిక కలెక్టరేట్లోని గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి ద్వారా దేశాభివృద్ధి సాధ్యమన్న గాంధీజీ గ్రామ స్వరాజ్య సాధనకు కృషిచేశారన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవని ఆనాడే గ్రహించి గాంధీజీ పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చేవార న్నారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, డిఆర్డిఏ పీడీ విజయరాజు, బీసీ కార్పొరేషన్ ఈడి పుష్పలత, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీజీ స్ఫూర్తితో ముందుకు సాగాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: మహాత్మా గాంధీ మార్గం అనుసరణీయమని, నేటి యువత వారి స్ఫూర్తితో ముందడుగు వేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.గురువారం గాంధీ జయంతిని పురస్కరించుకొని పాత బస్టాండ్ సెంటర్ బాంబే బేకరీ ఎదురుగా ఉన్న గాంధీజీ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పాల్గొని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి, చింతలపాటి బాపిరాజు జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ రెండో తేదీన గాంధీజీ జయంతిని అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా పాటించే సాంప్రదాయం 2007 సంవత్సరం నుండి ప్రారంభమైందన్నారు. గాంధీజీ ఆలోచనలు, భావనలు సిద్ధాంతాలు ఎందరికో స్ఫూర్తిగా నిలిచాయన్నారు. నేటి యువత కూడా వారి బాటలో అడుగులు వేస్తూ దేశ ప్రగతికి తోడ్పాటు నివ్వాలన్నారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజ నేయులు మాట్లాడుతూ అహింసా మార్గం ద్వారా ప్రపంచాన్ని ఎంత ప్రభావితం చేశారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదన్నారు. దేశం కోసం మహాత్మాగాంధీ చేసిన సేవలు అనంతం అన్నారు. పరిశుభ్రతపై గాంధీ ఆనాడే చెప్పారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, అర్బన్ బ్యాంక్ ఎస్సీ కె.శ్రీనివాస్, తహసీల్దార్ రావి రాంబాబు, పంచాయతీరాజ్ డీఈ స్వామి నాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొళ్ల నాగేశ్వరరావు, పట్టణ ప్రముఖులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం కోసం ఏరియా ఆసుపత్రికి తరలించాలి

విశాలాంధ్ర - నరసాపురం: మెరుగైన వైద్యం కోసం ఏరియా ఆసుపత్రికి తరలించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి గీతాబాయి అన్నారు. మండలంలో తూర్పుతాళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శు క్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ, ఐపీ, డెలివరీలు తదితర వివరాలు అడిగారు. ఆర్‌సీహెచ్, ఈహెచ్ఆర్ లక్ష్యాలు 100శాతం పూర్తి చేయాలన్నారు. కాన్పులు ఇతర అత్యవసర కేసులను సిహెచ్‌సీలకు తరలించాలని ఆదేశాలు ఇచ్చారు. వివిధ అంశాలపై సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. పీహెచ్‌సి స్టాఫ్‌నర్స్, సిహెచ్ఓ శ్రీనివాసరావు, హెచ్ఈ నాగమణి సిబ్బందికి సూచనలిచ్చారు.

నూజివీడులో అంబరాన్నంటిన దసరా సంబరాలు

విశాలాంధ్ర- నూజివీడు: నూజివీడులో దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా జమిందారీ వంశీయులు నిర్వహించారు. రెండో మైసూరుగా పేరు గాంచిన నూజివీడు దసరా ఊరేగింపులను వీక్షించేందుకు సమీప ప్రాంతాల ప్రజలు భారీగా తరలి వచ్చారు. శరన్నవరాత్రులలో ప్రఖ్యాతి గాంచిన నూజివీడు కోట మహిషాసుర మర్ధిని అమ్మవారికి సారె సమర్పించి దర్శిం చేందుకు ఈఏడాది భక్తులు ఆలయంకు అసంఖ్యా కంగా పోటెత్తారు. విజయదశమి రోజున నూజివీటి కోటలో ఉయ్యూరు ఎస్టేట్ రాజా మేకా వేంకటాద్రి రంగయ్య అప్పారావ్ బహద్దూర్ వంశీయులు జమ్మి చెట్టుకు పూజ చేసి, ఆనాటి యుద్ధ సామాగ్రికి శాస్త్రోక్తంగా ఆయుధ పూజలు నిర్వహించి దసరా ఉత్సవాలను ప్రారంభించారు. వైభవంగా సాగే దసరా వేడుకలకు రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారధి దంపతులు విచ్చేసి వివిధ కళాకారులు ప్రదర్శించిన నృత్యాలను ఆద్యంతం తిలకించారు. పోలీసులు పటిష్ట భద్రత చర్యలను చేపట్టారు. స్పోర్టింగ్ క్లబ్ ఆధ్వర్యంలో కబడ్డీ, బాస్కెట్ బాల్ పోటీలను ప్రారంభించారు. ఏనుగు అంబారిపై స్వామి వారి ఉత్సవ విగ్రహాలు, మహిళల కోలాటం, జానపద కళాకారుల ప్రదర్శనలు, చిన్నారుల వినోదపు ఆటల ఎగ్జిబిషన్, బుట్టబొమ్మల డ్యాన్స్‌లు, బేతాళ నృత్యాలు, కేరళ డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు, వివిధ రకాల కళల ప్రదర్శనలతో నూజివీడు పుర వీధులలో దసరా మహోత్సవం కన్నుల పండువగా సాగింది.

రైతులు రీ సర్వేను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: రైతులు రీ సర్వేను వినియోగించుకోవాలని తహసీల్దార్ టి ఎస్ సాయిబాబా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రీసర్వే ప్రాజెక్టులో భాగంగా 3వ ఫేజ్‌లో బొర్రంపాలెం, తెల్లం, శ్రీ రామవరం గ్రామాలు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుంచి రీ సర్వే ,ఫీల్డ్ వర్క్ (గ్రౌండ్ ట్రూతింగ్ వర్క్ మొదలవుతుందని, గ్రామాల్లో టాం టాం, గ్రామ సభలు నిర్వహించడం ద్వారా రైతులకు తెలియజేసినట్లు ఆయన తెలిపారు. తెల్లం, బొర్రంపాలెం, శ్రీ రామ వరం గ్రామాల్లో భూములు కలిగి వున్న రైతులందరికీ సర్వే నిర్వహించే ముందు నోటీసు, వాట్స్ యాప్, మెసేజ్, ఫోన్ కాల్ ద్వారా తెలియజేసి నప్పుడు ఆధార్ కార్డు జిరాక్స్, పాసుపోర్టు సైజ్ కలర్ ఫోటో, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, దస్తావేజులు జిరాక్స్‌తో హాజరై సర్వే చేయించుకోవాలని ఆయన తెలిపారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూడాలి

విశాలాంధ్ర – గణపవరం: మండలంలో ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా సర్పంచులు, కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని గణపవరం డిప్యూటీ ఎంపీడీవో పల్లి వెంకట సత్యనారాయణ అన్నారు. శుక్రవారం గణపవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా చట్టబద్ధమైన గ్రామసభ, ఎం జి ఎన్ ఆర్ ఇ జి ఎస్ గ్రామసభను గ్రామ సర్పంచ్ మూరా అలంకారం అధ్యక్షతన నిర్వహించారు. గ్రామ సభలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, పారిశుధ్య నిర్వహణ, స్వామిత్వ, పలు ఇతర అంశాలపై చర్చించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టవలసిన పనులను గుర్తించుట, ఇతర విషయాలు చర్చిం చారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు తోట శ్రీను, గణపవరం సొసైటీ అధ్యక్షులు కుసంపూడి సురేంద్ర కుమార్ రాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి దార్ల శివరామ ప్రసాద్, ఎన్ఆర్‌జిఎస్ తాతయ్య, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య స్ఫూర్తితో ముందుకు సాగాలి

విశాలాంధ్ర-ఏలూరు : జాతిపిత మహాత్మా గాంధీ 156వ జయంతి సందర్భంగా ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ)ఆధ్వర్యంలో కోటదిబ్బ ఎస్ఆర్ 1, వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా నాయకులు పి.కిషోర్, జోనల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎ. అప్పలరాజు మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ శాంతియుత పోరాటం నిర్వహించారని కొనియాడారు. మహాత్మా గాంధీ, అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్, సుభాష్ చంద్రబోస్ వంటి ఎందరో అమరవీరుల ప్రాణ త్యాగాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న దేశ స్వాతంత్ర్యం అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బుగత జగన్నాధరావు, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎస్ఎంవి సుబ్బారావు, ఎస్. శ్రీనివాస్, డి. వెంకటేశ్వర్రావు, బి.నారాయణ రావు, పివి రమణ, కె. శ్రీనివాస్, బి. దుర్గాప్రసాద్, బి. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంగా జాతీయ పతాకాన్ని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వర రావు ఆవిష్కరించగా, యూనియన్ కార్యాలయం వద్ద నున్న మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసడాంగే, జిల్లా నాయకులు పి. కిషోర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

విశాలాంధ్ర -భీమవరం: గాంధీజీ స్ఫూర్తితో భారత రాజ్యాంగ పరిరక్షణకు, ప్రజాస్వామ్య మనుగడకు, మత సామరస్యానికి, హక్కులసాధనకు పోరాడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నాయకులు తాలూకా ఆఫీసు సెంటర్లో ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ ప్రపంచ వ్యాప్తంగా పౌర హక్కుల కోసం, స్వేచ్ఛ కోసం ఉద్యమం తీసుకొచ్చారని కొనియాడారు. శాసనోల్లంఘన ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమాలతో ప్రజలను ఒక్క తాటి పైకి తెచ్చారని, రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా సహాయ నిరాకరణ ఉద్యమం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాస్, నాయకులు నాగిడి శాంతమూర్తి, రామారావు తదితరులు పాల్గొన్నారు. **భీమవరం హౌసింగ్‌బోర్డు కాలనీలో :** గాంధీజీ ఆశయాలను పాలకులు తుంగలోకి తొక్కుతున్నారని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు అన్నారు. గాంధీజీ జయంతి

పురస్కరించుకుని హౌసింగ్ బోర్డు కాలనీలో సీపీఐ నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చెల్లబోయిన మాట్లాడుతూ గాంధీజీ అహింసామార్గం అనుసరణీయమని, గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కలగానే మిగిలిపోయిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల త్రిమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యానికి పాటుపడాలి

విశాలాంధ్ర -భీమవరం: పూజ్య బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి మనమంతా నిరంతరం పాటుపడాలని జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలోని పూజ్య బాపూజీ విగ్రహానికి జాయింటు కలెక్టరు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటే దేశాభివృద్ధి సాధ్యమని గాంధీజీ ఆశయానికి అనుగుణంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. మన ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో మన చుట్టూవున్న పరిసరాలను అంతే శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ సూపరింటెండెంట్స్ మర్రాపు సన్యాసిరావు, నరేష్ చంద్రశేఖర్, భాను కుమార్, కలెక్టరేటు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేకు సహకరించాలి

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలో మూడో ఫేజ్ రీసర్వేను ములగలంపాడు, మడిచెర్లలో నిర్వహించ నున్నట్టు తహసిల్దార్ నజీముల్లాషా తెలిపారు. రీసర్వేకు సంబంధించి గ్రామసభల ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ గ్రామాలలో ప్రదర్శన చేశారు. రీసర్వేకు రైతులంతా సహకరించా లని కోరారు. రీసర్వే వల్ల భూమి వివాదాలు తలెత్తవని,ఉన్న వివాదాలు పరిష్కారం అవుతాయని ఈయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసిల్దార్ నాగబాబు, సర్పంచులు రమాదేవి, రాజేష్ బాబు, రంగాపురం సహకార సంఘఅధ్యక్షులు దినేష్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

1094 మందికి వాహన మిత్ర

విశాలాంధ్ర – ఉంగుటూరు : ఉంగుటూరు నియోజకవర్గంలో 1094 మంది ఆటో డ్రైవర్లను గుర్తించారు. ఉంగుటూరు మండలంలో 334 మంది, గణపవరం మండలంలో 303, భీమడోలు మండలంలో 287, నిడమర్రు మండలంలో 170 మందిని గుర్తించారు. శనివారం ఉదయం 10 గంటలకు ఉంగుటూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద వాహనమిత్ర పథకాన్ని ఎమ్మెల్యే ధర్మరాజు ప్రారంభిస్తారని ఉంగుటూరు ఎంపీడీవో మనోజ్ శుక్రవారం తెలిపారు. ఒక్కొక్క ఆటో డ్రైవర్‌కు ఏపీ ప్రభుత్వం రూ. 15వేలు వారి ఖాతాలో జమ చేయనున్నది.

నేడు వాహన మిత్ర ప్రారంభం

విశాలాంధ్ర- పాలకోడేరు : శనివారం విశాఖపట్నంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వాహన మిత్ర - ఆటో డ్రైవర్ సేవలో పథకాన్ని అమలు చేస్తున్నందున ఉండి నియోజకవర్గంలోని ఆకివీడు మండలం ఐ. భీమవరం గ్రామంలో గల కన్వెన్షన్ హాలులో డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్టు ఎంపీడీవో వి. రెడ్డియ్య తెలిపారు. పాలకోడేరు మండలంలో అర్హత కలిగిన ఆటో డ్రైవర్లందరినీ యూనిఫామ్‌తో హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆటో డ్రైవర్‌తో పాటు సంబంధిత సచివాలయ సిబ్బంది కూడా హాజరుకావలసి ఉంటుందని తెలిపారు.

జీఎస్టీ ఫలాలు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్టీ సంస్కరణలను సద్వినియోగం చేసుకోవాలని జంగారెడ్డి గూడెం జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి కోరారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం మార్కెట్ యార్డు ఆవరణలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సవరించిన జీఎస్టీ విధానం వల్ల అన్ని రంగాల ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్ కెవి రమణ, కౌన్సిలర్ సంబారి రామచంద్రరాజు, చక్రదేవరపల్లి సర్పంచ్ సాయిల సత్యనారాయణ, పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, రావూరి కృష్ణ, పెనుమర్తి రాంకుమార్, వ్యవసాయ, జీఎస్టీ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో చేపట్టిన స్వామిత్వా సర్వేను వేగవంతం చేయాలని డిఎల్‌పిఓ ఎమ్ నాగలత అన్నారు. మండలంలో మేజర్ పంచాయతీ రఘుదేవ పురం గ్రామ పంచాయతీ శుక్రవారం డి ఎల్ పిఓ ఎమ్ నాగలత ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా మండలంలో రఘుదేవపురం గ్రామ పంచాయతీ స్వామిత్వ సర్వేలో వెనుకంజలో ఉందని అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అక్టోబర్ 15 నాటికి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా చెత్త సంపద కేంద్రం షెడ్ నిర్మాణం కోసం అనువైన స్థలం గుర్తించి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీలో పన్నుల చెల్లింపులు పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మూర్తి, కార్యదర్శి రత్నం, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వెంకన్న ఆలయంలో అన్నదానం

విశాలాంధ్ర - సీతానగరం: అనేక విధాలుగా భగవంతుడికి సేవ చేస్తూ నేడు అన్నదానంకు శ్రీకారం చుట్టిన వాకపల్లి సూరిబాబు. మండలంలో చినకొం డేపూడి గ్రామ పంచాయతీ పరిధిలో రేషన్ షాప్ డీలర్‌గా పనిచేస్తున్నారు. గత 25 సంవత్సరముల నుంచి తిరుపతి వెంకన్నబాబు గుడికి బియ్యం, గుమ్మడికాయలు పంపిస్తూ, వాడపల్లి వెంకన్నబాబు గుడికి బియ్యం, కూరగాయలు, తంటికొండ వెంకన్న బాబుగుడికి కూరగాయలు, బియ్యం, రంపచోడవరం వెంకన్నబాబు గుడికి 600 మందికి అన్నదాన కార్యక్రమం జరిపించారు. నేడు శనివారం కోరుకొండ మండలంలో గుమ్మళ్లదొడ్డి గ్రామంలో కొలువుతీరిన వెంకన్నబాబు ఆలయంలో 3500 మందికి అన్నదాన కార్యక్రమం నిమిత్తం గ్రామం ప్రజల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుం దన్నారు. ఈ అన్నదానాలకు సహకరించిన భక్తులందరినీ వేంకటేశ్వరస్వామి ఎల్లవేళలా చల్లగా చూడాలని, మా డీలర్లు నాకు సహ కరిస్తూ వారిని చల్లగా చూడాలని కోరుతున్నట్లు తెలిపారు.

పెట్రోల్ బంక్ తనిఖీ

విశాలాంధ్ర-తాళ్లపూడి అన్నదేవరపేట సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న పెట్రోల్ బంక్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. సొసైటీ అద్వర్యం లో కన్స్యూమర్ లైసెన్స్ పై నడుస్తూ సుమారు సంవత్సర కాలంగా నిలిపివేయ బడ్డ పెట్రోల్ బంక్ రిటైల్ లైసెన్స్ గా మార్చి సొసైటీకి ప్రజలకి అందుబాటులోకి తేవాలని నూతన కార్యవర్గం అధ్యక్షులు గోరిజాల ఆలోచనతో చర్యలు చేపట్టారు. 20 వేల లీటర్ల డీజిల్, 20 వేల లీటర్ల పెట్రోల్ విక్రయాలకు పర్మిషన్ల పొందనున్నారు. దీనిలో భాగంగా జిల్లా జాయింట్ మేఘ స్వరూప్ కలెక్టర్ శుక్రవారం బంక్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీ లావణ్య, వీఆర్వో నాగేశ్వరరావు, సొసైటీ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో పేదలకు ఊరట : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఊరట లభించిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. కూటమి ప్రభుత్వం పేదలకు లబ్ది చేకూర్చేలా ప్రారంభించిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా స్థానిక 25వ వార్డు - నేతాజీ స్కూల్ వద్ద ,అన్నపూర్ణ థియేటర్ ప్రాంతంలో శుక్రవారం ఉదయం ఎమ్మెల్యేతో పాటు , మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, కూటమి నాయకులు యర్రా వేణు గోపాల రాయుడు, కాశీ నవీన్ కుమార్, దొండపాటి సత్యంబాబు, అత్తి సత్యనారాయణ, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధా, వర్రే శ్రీనివాసరావు, వై శ్రీను, రెడ్డి మణేశ్వరరావు, కురగంటి సతీష్, అడబాల రామకృష్ణలు షాపులు, ప్రజల వద్దకు వెళ్లి సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కర పత్రాలను అందచేశారు. ముఖ్యంగా కిరాణా సామాగ్రిపై గతంలో 18శాతం, 12శాతం , 5శాతం జీఎస్టీ ఉండేదని, ఇప్పుడు కొన్నింటి పై 5శాతం , కొన్నింటిపై జీరో శాతం చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో సంస్కరణలను స్వాగతిస్తూ మరోపక్క విద్యుత్ చార్జీలపై 17పైసల భారం తగ్గించామని, ఇది వచ్చేనెల బిల్లులో కనిపిస్తుందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించే కార్యక్రమాన్ని తీసుకున్నామన్నారు. స్వదేశీ వస్తువులను వినియోగం చాలని పిలుపునిస్తూ ఖాదీ సంత పెట్టడం జరిగిందన్నారు. ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర కింద రూ. 15వేలు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. డివిజన్‌ఇన్‌ఛార్జ్ తవ్వా రాజా పర్యవేక్షణలో, డివిజన్ ప్రెసిడెంట్ ముద్రగడ జయరామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబనకు మరోసారి స్వదేశీ ఉద్యమం : బీజేపీ

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : నాడు దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ నడిపిన స్వదేశీ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రస్తుతం దేశ ఆర్థిక స్వావలంబన కోసం మరోసారి స్వదేశీ ఉద్యమానికి ప్రధాని మోదీ పిలుపునిచ్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చెప్పారు. స్వదేశీ అంటే అదేదో పాత చింతకాయ పచ్చడి కాదని, ఇది నిత్య నూతనం అని ఆయన వ్యాఖ్యానించారు. స్థానిక సుబ్రహ్మణ్య మైదానంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ద్వితీయ ఖాదీ సంత రెండవ రోజు శుక్రవారం ఆయన సందర్శించారు. స్టాల్స్ అన్నీ కలియదిరిగి పరిశీలించారు. అనంతరం అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులతో కల్సి మీడియాతో మాట్లాడారు. 2014లో మోదీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి నినాదాలతో స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారని మాధవ్ అన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిం చడం కోసం మేకిన్ ఇండియాలో భాగంగా ముద్రలోన్స్ ప్రవేశ పెట్టారని, అందరినీ బ్యాంకింగ్ రంగానికి చేరువ చేసే విధంగా జన్‌ధన్ ఖాతాలు తెచ్చారని మాధవ్ వివరించారు. రక్షణ రంగంలో మనం ఎవరిపై ఆధార పడకూడదన్న ఉద్దేశ్యంతో స్వదేశీ పరిజ్ఞానంతో పరికరాలు తయారుచేసే దిశగా అడుగులు వేయడం వలన ఆపరేషన్ సిందూర్ సమయంలో మన రక్షణ వ్యవస్థ గురించి ప్రపంచానికి చాటగలిగామని ఆయన చెప్పారు. మద్దిపాటి రజిని స్వదేశీ వస్తు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా బిజెపి అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తపన చౌదరి, ఖాదీ సంత కన్వీనర్ క్షత్రియ బాలసుబ్రహ్మణ్యం సింగ్, బిజెపి నాయకులు కోడూరి లక్ష్మీనారాయణ, అడబాల రామకృష్ణ, రొంగలి గోపి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - కడియం : జీఎస్టీ తగ్గింపు ద్వారా పేద మధ్య తరగతి ప్రజలకు మేలు జరుగుతుందని కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్, ఎంపీడీవో కే రమేష్ అన్నారు. మండల కేంద్రమైన కడియం గ్రామంలో జీఎస్టీ తగ్గింపు పై అవగాహన ర్యాలీ, సచివాలయాల స్థాయిలో సమావేశాలు, సూపర్ మార్కెట్లు, షోరూమ్ లు, పలు దుకాణాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా అధికారులు ప్రజలకు జీఎస్టీ తగ్గింపు వలన పాత, కొత్త ధరల మధ్య మార్పులను వివరించారు. వినియోగదారులు, వ్యాపార యజమానులతో జీఎస్టీ తగ్గింపు వలన కలిగే ప్రయోజనాలపై చర్చించారు. తమ పరిధిలో గల ప్రజల్లో జీఎస్టీ తగ్గింపు వలన కలిగే ప్రయోజనాలపై మరింత అవగాహన కల్పించాలని పంచాయితీ కార్యదర్శులను సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వెలుగు శాఖ ఏపిఎం నాగలక్ష్మి, స్థానిక ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై ప్రచారం

విశాలాంధ్ర-తాళ్లపూడి : జీఎస్టీ 2.0 క్రింద అనేక రకాల నిత్యావసరాల వస్తువులపై భారీగా పన్నులు తగ్గించే చర్యలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాయని, దీని వల్ల ప్రజలకు చేకూరే లాభాలను తెలియ పరిచేందుకు ర్యాలీలు, అవగాహన కలిస్తున్నామని సేల్స్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు తాళ్లపూడి మెయిన్ రోడ్‌లో అనేక వ్యాపార సంస్థల యజమానులు, సిబ్బంది డిసిటివో కె.సుబ్రమణ్యం, ఆ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి : ఎంపీపీ

విశాలాంధ్ర-దేవరపల్లి: ఈ ప్రభుత్వ ఉద్యోగి కైనా పదవి విరమణ తప్పనిసరిని ఉద్యోగంలో చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని సర్వీసులో ఏ విధమైన ఇబ్బందులు లేకుండా పదవీ విరమణ చేయటం గొప్ప విషయమని దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు పేర్కొన్నారు . దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శు క్రవారం బంధపురం గ్రామకార్యదర్శి షేక్ మొహిద్దీన్ షరీఫ్ పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ దుర్గారావు మాట్లాడుతూ 37 సంవత్సరాలు ఉద్యోగం చేసి బంధపురం గ్రామ కార్యదర్శిగా పదవి విరమణ చేసిన షేక్ మొహిద్దిన్ షరీఫ్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగ విషయంలో షరీఫ్ మండలంలో మంచి ఉద్యోగిగా గుర్తింపు పొందాలన్నారు. ఎంపీడీవో సిహెచ్ నాగార్జున సాగర్‌రావు మాట్లాడుతూ నేను కొత్తగా బాధ్యతలు స్వీకరించిన షరీఫ్ యొక్క సేవలు తెలుసుకున్నానని గుర్తు చేశారు. షరీఫ్ ఆయురారోగ్యాలు ఇవ్వాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పదవి విరమణ చేసిన షేక్ మొహిద్దిన్ షరీఫ్ షేక్ హాబి బున్నిసా దంపతులను ఎంపీపీ దుర్గారావు ఎంపీడీవో నాగార్జునసాగర్‌రావు మండలంలో గ్రామ కార్యదర్శులు మండల పరిషత్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరిండెంట్ జీ శాంతి, సీనియర్ అసిస్టెంట్ కుసుమ, జూనియర్ అసిస్టెంట్ తనుజ టైపిస్ట్ హరి, గ్రామ కార్యదర్శులు అమ్మి రాజు, బి రామచంద్రరావు, పి హరీష్‌బాబు. ఎం రాజేష్ తదితరులు పాల్గొన్నారు

గాంధీ, శాస్త్రి సేవలు స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర - కడియం : గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి సేవలు నేటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకం కావాలని కడియం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ఏపీఐఐసి డైరెక్టర్ మార్గాని సత్యనారాయణలు పేర్కొన్నారు. జై జవాన్-జై కిసాన్ సేవా సంస్థ అధ్యక్షులు చిక్కాల ఈశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం రాత్రి కడియం బొబ్బిలిబ్రిడ్జ్ సెంటర్లో మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సం దర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత రక్షణ శాఖ యుద్ధ పరికరాల సామగ్రి తయారు చేసే మిధాని సంస్థలో సీనియర్ సైంటిస్ట్‌గా సేవలందిస్తున్న కొండేపూడి చంద్రావతి, కార్గిల్ యుద్ధం హీరో సలారి యస్ గోవిందరావు, ప్రకృతి సేద్యపు రాష్ట్ర ఉత్తమ రైతు పురస్కార గ్రహీత అన్నందేవుల చంటి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు తదితరులకు సేవ పురస్కారాలు అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోసుగంటి సత్యవతి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

గాంధీని ఆదర్శంగా తీసుకోవాలి : ఎంపీపీ

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నాడు గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కేవీకే దుర్గారావు ఎంపీడీవో సిహెచ్ నాగార్జున సాగర్‌రావు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లాడుతూ అహింస మార్గం ద్వారా భారతదేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన ఘనత మహాత్మా గాంధీదేనన్నారు యువతీ యువకులు మహాత్మా గాంధీని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఎంపీడీవో సిహెచ్ నాగార్జునరావు మాట్లాడుతూ మహాత్మా గాంధీ విశిష్టతను అహింసా మార్గాన్ని వివరించారు ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరిండెంట్ జీ శాంతి, సీనియర్ అసిస్టెంట్ కుసుమ, టైపిస్ట్ హరి, ఎంపిటిసి కామిశెట్టి శిరోమణి, వైసీపీ నేతలు దుగ్గిన గంగాధరరావు, కామిశెట్టి దుర్గారావు, పచ్చ రాంగోపాల్, దుగ్గిన ప్రసాద్, చీకట్ల వీర వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారి ఆశ్రమంలో విజయదశమి వేడుకలు

విశాలాంధ్ర-కోరుకొండ : ఓం శాంతి కోరుకొండ బ్రహ్మకుమారిస్ ఆశ్రమం వారు విజయదశమి సందర్భంగా చిన్నారులతో దేవతల యొక్క అలంకరణ, నృత్య కార్యక్రమాలు ఏర్పాటు చేశారు .ఇందులో భాగంగా బ్రహ్మకుమారి పార్వతి దేవినవరాత్రులు అంటే తొమ్మిది రోజులు అమ్మవారు మహిషాసురతో 9 అవతారాలతో యుద్ధం చేసి ఆఖరి రోజు విజయం పొందారు, దానికి గుర్తు విజయదశమి చేస్తారు. విజయదశమి రోజు ఏ పని మొదలుపెట్టిన అది నిర్విఘ్నంగా జరుగుతుంది, ఆటంకం కలగదని మంచి రోజున చేస్తారు. అయితే ఇక్కడ జమ్మి పూజ చేసినట్టు చూపిస్తారు. అర్జునుడు అక్కడ గాండీవం దాచిపెట్టారు, ఆ రోజు పూజ చేసి ఆయుధాలు కింద దించుతారు. అంటే దాని అర్థం ఎప్పుడైతే మనం విజయం పొందాలి అనుకుంటున్నాము అప్పుడు మనం లోపల ఉన్న భగవంతుడు ఇచ్చినటువంటి జ్ఞానమని ఆయుధాన్ని ఉపయోగించాలి. తెలివి, మంచి ఇవే మనకి ఆయుధాలు ఇప్పుడు ఉన్నటు వంటి అస్త్రాన్ని చంపడానికి. దీనిలో బ్రహ్మకుమారి ఆశ్రమ నిర్వాహకులు రాజు, వరలక్ష్మి అనేకమంది భక్తులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు మేలు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర- కొవ్వూరు : వ్యవసాయ పరికరాల మీద జీఎస్టీ తగ్గింపు రైతులకు మేలుకలుగుతుందని శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శాసనసభ్యులు రైతులతో కలిసి మున్సిపల్ కార్యాలయం నుంచి ట్రాక్టర్‌పై ఇందిరమ్మ కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతులకు ప్రజలకు జీఎస్టీ తగ్గిన వస్తువులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాల యొక్క స్పేర్‌పార్ట్స్, బయో పురుగుమందులు, సూక్ష్మ ఎరువులు, డ్రిప్ ఇరిగేషన్ వస్తువులు, తుంపర సేద్యం వస్తువులు, నాగళ్ళు,గొర్రెలు కోత యంత్రాలు,నూర్పిడి యంత్రాలు వీటన్నిటిపై జీఎస్టీ తగ్గించడం జరిగిందని తెలియజేశారు. ఈ అవకాశాన్ని రైతులు స్వాధినియోగం చేసుకోవాలన్నారు. ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ రైతులకు ఆర్థికంగా మేలు జరుగుతుందని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపువల్ల రైతుకు ఆర్థిక భారం తగ్గి కొనుగోలు శక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దిశభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బారాయ చౌదరి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్ కుమార్, కొవ్వూరు టీడీపీ పట్టణ అధ్యక్షులు దాయన రామకృష్ణ,పెనమాక జయరాజు వేమగిరి వెంకట్రావు , మున్సిపల్ కమిషనర్ జి. సందీప్, కొవ్వూరు ఏడి ఏ సిహెచ్ శ్రీనివాస్ రావు , హార్టికల్చర్ ఆఫీసర్ మండల వ్యవసాయ అధికార, గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు ప్రజలు పాల్గొన్నారు.

'శ్రీ అగస్త్య' విద్యాసంస్థలకు ప్రత్యేక గుర్తింపు

విశాలాంధ్ర - కాకినాడ : పాఠశాల, కళాశాలలను స్థాపించిన అనతికాలంలోనే ఉభయగోదావరి జిల్లాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన 'శ్రీ అగస్త్య' విద్యాసంస్థలు పెద్దాపురం, సామర్లకోట పట్టణాలలోని విద్యార్థులకు కాన్సెప్ట్ ఓరియంటేషన్ (సిఓ)ను మరింత దగ్గర చేసేందుకు పెద్దాపురంలో తన ఐదవ బ్రాంచ్‌ను ప్రారంభిస్తుంది. విజయదశమిని పురస్కరించుకుని పెద్దాపురం అయోధ్యనగర్‌లో ప్రారంభించనున్న 'శ్రీ అగస్త్య' పాఠశాల బ్రాంచ్‌కు సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్, పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ & టిడిపి పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజా సూరిబాబురాజులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ముఖ్య అతిథి రంగనాగ్ మాట్లాడుతూ కాకినాడలో నాలుగు బ్రాంచ్‌లతో మూడు సంవత్సరాలలోనే ఐఐటి, ఎన్ఐటి, ఈఏపిసెట్‌లతో పాటు నీట్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన 'శ్రీ అగస్త్య' పెద్దాపురంలో ప్రారంభం కానుండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 'శ్రీ అగస్త్య' పెద్దాపురం బ్రాంచ్ విజయవంతంగా ముందుకు సాగి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. మరో ముఖ్య అతిథి రాజా సూరిబాబురాజు మాట్లాడుతూ సాధారణ విద్యార్థులు సైతం ఐఐటి, నీట్‌లలో విజయం సాధించేలా కాన్సెప్ట్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను అవలంభించడం ద్వారా ఈ ఉత్తమ ఫలితాల సాధనకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. 'శ్రీ అగస్త్య' విద్యాసంస్థల చైర్మన్ & కరస్పాండెంట్ దొడ్డిపట్ల నాగేశ్వరరావు (డీఎన్ఆర్) మాట్లాడుతూ ఈ బ్రాంచ్‌లో 2026-2027 విద్యా సంవత్సరానికి విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములు రామకృష్ణ, పెద్దాపురం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మొయిళ్ళ కృష్ణమూర్తి, 'శ్రీ అగస్త్య' విద్యాసంస్థల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-దేవరపల్లి: విజయదశమి పర్వదిన సందర్భంగా దేవరపల్లి మండలంలో దేవరపల్లి బాలదుర్గం ఆలయంలో గురువారం శ్రీ రాజరాజేశ్వరి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు, పురోహితులు అఖండం వంశీకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆలయం కోశాధికారి కామిశెట్టి దుర్గారావు, శిరోమణి దంపతులు పూజలు నిర్వహించారు. సౌభాగ్యదుర్గంబిక పల్లపు వీధి రామాలయంలో ప్రతిష్టించిన అమ్మవారు దేవరపల్లి ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీదేవి విజయదుర్గ రాజరాజేశ్వరి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. దేవరపల్లి మండలం పల్లంట్లలో శ్రీ రాజరాజేశ్వరీ సమేత దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు రాజేశ్వరి అవతారంలో దర్శనమిచ్చారు. చెరువుగట్టు వద్దగల విజయ కనకదుర్గ అమ్మవారు రాజేశ్వరి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పల్లట్ల విజయదుర్గ అమ్మవారి ఆలయం వద్ద ప్రతిష్టించిన అమ్మవారిని ఊరేగింపు నిర్వహించారు. మేడ తాళాలతో ట్రీన్‌మార్ డప్పు వాయిద్యాలతో పల్లంట్ల పురవీధులలో అమ్మవారిని ఊరేగించారు. మండలంలో అన్ని గ్రామాలలో రాజేశ్వరి అవతారంలో భక్తులకు దర్శనం యిచ్చారు.

పశువుల షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం దేవరపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా చేపట్టిన పశువుల షెడ్ నిర్మాణం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగం గా శంకుస్థాపన మహోత్సవం లబ్ధిదారుడు కవల సురేష్ పొలం గురువారంచేయటం జరిగింది. దీనిలో భాగం గా ఎంపీపీ దుర్గారావ, దేవరపల్లి సొసైటీ చైర్మన్ ఉప్పులూరు న్యోంద్ర రామారావు మాజీ సొసైటీ అధ్యక్షులు కవల శ్రీనివాస్ జనసేన గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జ్ డి సువర్ణ రాజు గ్రామ కమిటీ అధ్యక్షుడు కంబాల సత్తిబాబు సూరిశెట్టి బాలు, పశు పులేటి శివ నాగ ప్రసాద్, మాధవరపు వెంకటేశ్వ రరావు, దుగ్గిన లీలగంగాధర్ నాయుడు, ఆకులనాని, జాజి మొగ్గల శ్రీను, ఎంపీడీవో నాగార్జున , సిహెచ్ నాగార్జున రావు ఏపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మురమళ్ళ నిత్య కల్యాణం టిక్కెట్లు విడుదల

విశాలాంధ్ర - కాట్రేనికోన : నిత్యకళ్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ళ శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరేశ్వర స్వామి ఆలయం 2025 నవంబర్ నెలకు సంబంధించి నిత్యకళ్యాణాలు విడుదల చేసినట్లు ఆలయ చైర్మన్ దాట్ల రామకృష్ణం రాజు, సహాయ కమిషనర్ కార్యనిర్వాహణాధికారి వి సత్యనారాయణ తెలిపారు. మొత్తం 30 రోజులకు సంబంధించి 3480 కళ్యాణాలకు ఆన్లైన్‌లో 2040, కార్యాలయంలో 1440 అందుబాటులో ఉంటాయన్నారు. ఆన్లైన్‌లోగాని, నేరుగాని నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. అలాగే కార్తీక మాసం నెల రోజులు స్వామి నిజరూప లింగానికి పంచామృతాభిషేకం తోపాటు అక్టోబర్/నవంబర్/డిసెంబర్ నెలలకు సంభందించి నిత్య, మాస, వార్షిక పూజలు రుద్ర హెూమం, చండి హెూమం, లక్ష పత్రి పూజ, ద్వాదశ పుష్కర నదీ జలాభిషేకం టిక్కెట్లు ఆన్లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఆన్‌లైన్ కళ్యాణాలు, నిత్య, మాస పూజలకు దేవస్థానం వెబ్సైట్ www.sriveereswaraswamytemple.com, aptemples.ap.gov.in ద్వారా సంప్రదించాలని సూచించారు.

జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న జీఎస్టీ-సూపర్ సేవింగ్ క్యాంపెయిన్‌లో భాగంగా, జీఎస్టీ ఆంధ్రప్రదేశ్ 'డబుల్ బెనిఫిట్స్' ప్రచార గోడపత్రికను శుక్రవారం ఉదయం తన కార్యాలయ ఛాంబర్‌లో కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ భావన, ఐఏఎస్ ఆవిష్కరించారు. జిల్లా వినియోగ సమాచారం కేంద్రం మరియు కాప్కో ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గోడపత్రికను విడుదల చేశారు. కమిషనర్ భావన మాట్లాడుతూ, తగ్గిన జీఎస్టీ రేట్లు పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థికంగా ఉపశమనం కలిగించడమే కాకుండా మహిళా సాధికారతకు కూడా దోహదపడ తాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచారం కేంద్రం ఇన్చార్జి బి శివమూర్తి, జిల్లా కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ మెంబర్ హెచ్ఎస్ రామకృష్ణ, కొమ్మూరి శ్రీనివాసరావు, పవన్ చైతన్య పాల్గొన్నారు.

బాపూజీ జయంతి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : పట్టణంలోని 3వ వార్డ్ షిర్డీ నగర్ గాంధీసెంటర్లో బాపూజీ జయంతి వేడుకలను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ఆర్యవైశ్య ఉపాధ్యక్షులు గొల్లపూడి త్రిమూర్తులు ఆధ్వర్యంలో బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా టిడిపి నాయకులు బొదిరెడ్డి గోపాలకృష్ణ(గోపి), మూది నారాయణస్వామి పాల్గొన్నారు. బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీజీ శాంతియుత మార్గంలో మన దేశానికి స్వతంత్రాన్ని తీసుకువచ్చిన ఘనత గాంధీజీది అని, యువత శాంతియుత మార్గంలోనే నడుచుకుని దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. అనంతరం గొల్లపూడి త్రిమూర్తులు మాట్లాడుతూ మూడో వార్డులో గాంధీజీ విగ్రహం వద్ద గత ఐదు సంవత్సరాలుగా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగు తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వాగు రాజేష్, అనంతపల్లి శ్రీను, గొల్లపూడి నరేష్, గ్రంధి కృష్ణమూర్తి, సత్యనారాయణ, కోరాడ బాబూరావు, అర్జున్, పోరాడ శ్రీను, పసుపులేటి శ్రీను, మూర్తి, ఆర్ సలాస్ పాల్గొన్నారు.

అమరావతి ఏసీ బస్సు పునరుద్ధరణ

విశాలాంధ్ర - అమలాపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అమలాపురం డిపో అమల పురం నుంచి హైదరా బాద్ (బిహెచ్ ఇఎల్)కి నడుస్తున్న అమరావతి ఏసీ బస్సు ఇటీవల కొన్ని సాంకేతిక కారణాలు వలన బస్సు నిలుపుదల చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్టిపి రాఘవకుమార్ తెలిపారు. మరల అమరావతి ఏసీ బస్సు అక్టోబర్ 2 నుంచి ప్రతీ రోజు అమలాపురం నుండి హైదరాబాద్ బిహెచ్ఇఎల్‌కి ప్రారంభించబడినది. అమలా పురం డిపో నుండి రాత్రి 08.30కి సర్వీస్ నెంబర్ 2572, హైదరాబాద్ బిహెచ్ నుండి రాత్రి 07:45 గంటలకు సర్వీస్ అ.శ్రీ.2573 బయలుదేరును. www.apsrtconline.in వెబ్ సైట్ ద్వారా ప్రయాణీకులు ఈ అవకాశాన్ని వినియో గించుకోవలసినదిగా జిల్లా ప్రజా రవాణాధికారి ఎస్టిపి రాఘవ కుమార్ తెలిపారు.

సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ టోర్నమెంట్‌కు ఆదిత్య జట్టు

విశాలాంధ - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ. ఈ అక్టోబర్ 4 నుంచి 7 వరకూ రాణి చెన్నమ్మ యూనివర్సిటీ, కర్ణాటకలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీమెన్ టోర్నమెంట్-2025లో పాల్గొనేందుకు ఆదిత్య యూనివర్సిటీ తరపున కబడ్డీ జట్టు పయనమై వెళ్లినట్లు డిప్యూటీ ప్రో ఛాన్సెలర్ డా ఎమ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సౌత్ జోన్‌కి సెలెక్ట్ అయ్యి టోర్నమెంట్‌లో పాల్గొనే టీం అత్యుత్తమ స్థాయిలో ప్రతిభ కన బరిచి విజయంతో తిరిగిరావాలని ఆకాంక్షిస్తూ టీమ్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రో వైస్ ఛాన్సెలర్ డా ఏ రమేష్, డీన్ డా డి కిషోర్, వ్యాయామ విద్య విభాగధిపతి డా ఎన్ రవి పాల్గొనటం జరిగింది.

10న జాబ్‌మేళా

విశాలాంధ్ర - కాకినాడ 'వికాస' కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడలో 10న 'జాబ్‌మేళా' నిర్వహిస్తున్నారు. ఈ జాబ్‌మేళాలో బజాజ్ కాపిటల్ ప్రై॥లి॥లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్షియల్ అడ్వయిజర్, టెలికాలర్, ఐఫోన్ ఎక్స్‌పీరియన్సెన్ కంపెనీలో టెలి సేల్స్ రిప్రెజంటేటివ్, డెక్కన్ కెమికల్స్‌లో ట్రైనీ (ప్రొడక్షన్ & మెకానికల్ మెయిన్‌టెనెన్స్), హోండాయ్ మోబిస్, ఇసుజు కంపెనీల్లో టెక్నిషియన్, పహర్పూర్ కంపెనీలో ఆపరేటర్, టెక్నిషియన్ ఫాక్స్‌కాన్ కంపెనీలో మొబైల్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులైన 35సం.లోపు అభ్యర్థులు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 6న సోమవారం 'వికాస కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ వద్ద ఉదయం 9గం.లకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌లతో హాజరుకావలెను. మరిన్ని వివరాలకు 7799376222 డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. వికాసజాబ్స్. కం సంప్రదించవలెను.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు సబ్ స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఐదు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు, పి గన్నవరం మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

వివేకానంద బోధనలు స్ఫూర్తిగా తీసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర - పెదపూడి : యువతరం స్వామి వివేకానంద బోధనలను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత వ్యక్తులుగా ఎదగాలని, యువతే దేశానికి భవితగా నిలవాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. శుక్రవారం పెదపూడిలో రామకృష్ణ మిషన్ సభ్యులు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయంలో అనపర్తి రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో వివేక పథం-2026 పేరిట ముద్రించిన స్వామి వివేకానంద జీవితం-సందేశం ఫోల్డర్స్ కలెక్టర్ కీర్తి చేకూరి ఆవిష్కరించారు. తొలి ప్రతి సమితి అధ్యక్షులు పడాల సుబ్బారెడ్డికి కలెక్టర్ అందజేశారని ఆయన చెప్పారు. రామకృష్ణ మిషన్ సభ్యులు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని ప్రతి ఏడాది అనపర్తి మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఫోల్డర్స్ అందించి వాటిపై పోటీ పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. సమితి ఉపాధ్యక్షులు సత్తి వెంకటరెడ్డి (బులితమ్ము), తేతలి సుందర రామారెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి సుబ్బారెడ్డి, కార్యదర్శులు తాడి చంద్రశేఖర్‌రెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి (789), కొవ్వూరి సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన

విశాలాంధ్ర - కాకినాడ : సామర్లకోట మండలం కొప్పవరం గ్రామంలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా దర్బార్ కార్యక్రమాలకు ప్రజలు విశేష స్పందన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం జరిగిన 24వ ప్రజా దర్బార్‌లో స్వయంగా ఎంపీ సానా సతీష్ బాబు పాల్గొని, జిల్లాలోని నలుమూలల నుండి తరలివచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. ఇళ్ల స్థలాలు, వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్లు, సిఎం రిలీఫ్ ఫండ్, ఉపాధి అవకాశాలు వంటి అంశాలతో పాటు అనేక సమస్యలపై ప్రజలు అర్జీలను సమర్పించారు. ముఖ్యంగాడీఎస్సీ అభ్యర్థులు 1:1 విధానంలో తలెత్తిన సమస్యను పరిష్కరించాలంటూ తమ విన్నపాన్ని ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఎంపీ సానా సతీష్ బాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి ఈ సమస్యను వెంటనే తీసుకెళ్లి పరిష్కారం కోసం చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, నాయకులు తోట నవీన్, నులుకుర్తి వెంకటేశ్వరరావు, వివై దాసు, గింజాల శ్రీనివాస్, ఎంపీ కార్యాలయ ఇన్చార్జ్ మేకా లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా విజయవంతం చేయండి

విశాలాంధ్ర - రాజోలు : విజయవాడలో ఈ నెల 7న జరిగే ఫ్యాప్టో మహాధర్నాను విజయవంతం చేయాలని రాజోలు తాలూకా ఫ్యాప్టో ఇన్‌ఛార్జి కార్యవర్గ సభ్యులు ఆర్ఆర్‌కె ప్రసాద్, కేశవరావులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో తాలూకా స్థాయి సమావేశం సూచించారు. ఈ సందర్భంగా తాలూకా స్థాయి ఫ్యాప్టో కార్యవర్గ సభ్యుడు ఆర్ఆర్ కె ప్రసాద్ మాట్లాడుతూ ఏకీకృత సర్వీస్ సమస్యలను పరిష్కరించాలని, పీఆర్సీ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, ఉపాధ్యాయులను బోధనకు తప్ప బోధనేతర పనులకు ఉపయోగించకూడదని, సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని, అస్సెస్మెంట్ పుస్తకాలపై పునః సమీక్ష జరపాలని సూచించారు. కేశవరావు మాట్లాడుతూ విద్యాశాఖలో ఖాళీగా ఉన్న కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. అనే పలురకాల డిమాండ్లతో తలపెట్టబోయే మహా ధర్నాకు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై ధర్నాను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మామిడికుదురు మండలం నుంచి కళ్యాణ్బాబు, రాజోలు నుంచి కె రాజబాబు, వైవి వి ప్రసాద్, మలికిపురం మండలం నుంచి నారాయణ స్వామి, బేతినీడి శ్రీనివాస్, సఖినేటిపల్లి మండలం నుండి శ్యాంసన్, గోపిరాజ్, గెద్దాడ రాధాకృష్ణ, అడబాల కాశీ పాల్గున్నారు.

చెడి తాలింఖానా కమిటీలకు రూ.70 వేల విరాళం

విశాలాంధ్ర - అమలాపురం : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నటించిన ఓజీ చిత్రం అభిమానుల్లో పండగ వాతావరణం తీసుకొచ్చింది. ఈ క్రమంలో అమలాపురం పట్టణ పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు, జనసేన పార్టీ నాయకులు ఆర్డీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఓజి సినిమా తొలి టిక్కెట్ వేలం పెట్టగా రూ.60 వేలు పలికింది. దానికి అభిమాన సంఘం తరపున ఆర్డీఎస్ ప్రసాద్ మరో రూ.10 వేలు జతచేసి అమలాపురంలో వందల ఏళ్ళుగా సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తూ, చెడితాలింఖానా యుద్ధకళను దసరా ఉత్సవాల్లో సాంప్రదాయ బద్ధంగా కొనసాగిస్తూ వస్తున్న ఏడు ఉత్సవ కమిటీలైనా చెడితాలింఖాన కొంకాపల్లి, శ్రీఅబ్బిరెడ్డి రామదాసు చెడితాలింఖాన మహిపాలవీధి, శ్రీ శేషశయన మైనర్స్ పార్టీ గండు వీధి, మైనర్స్ పార్టీ రవణం మల్లయ్య వీధి, శ్రీ మహిషాసుర మర్దిని యువజన సంఘం రవణం వీధి, శ్రీ విజయదుర్గ యువజన సంఘం నల్లా వీధి, చెడితాలింఖాన మైనర్స్ పార్టీ (శ్రీరాంపురం వార్లకు రూ.10 వేల చొప్పున విరాళంగా అందించారు. పవన్ కళ్యాణ్ ఆశయ సాధనలో భాగంగా సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఆయన చేస్తున్న కృషికి స్ఫూర్తిగా శుక్రవారం రూ. 70 వేలు దసరా ఉత్సవ కమిటీలకు ఇస్తున్నట్లు ఆర్డీఎస్ ప్రసాద్ తెలిపారు. శ్రీరాంపురం ఉత్సవ కమిటీకి దశాబ్దాల కాలంగా ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ "సమస్యలపై ప్రశ్నించడం, సాయం కోరిన వారికి చేయి అందించడం పవన్ కళ్యాణ్ యొక్క ఆశయాలు అని, ఆ ఆశయాలను కొనసాగిస్తూ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు క్షేత్ర స్థాయిలో పనిచేయడం, ఇలా ఆర్డీఎస్ ప్రసాద్ నాయకత్వంలో సంప్రదాయానికి ప్రోత్సాహంగా రూ. 70 వేలు తాలింఖానా కమిటీలకు అందచేయడం చాలా మంచి విషయం" అని అన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో అధ్యక్షులు ఆర్డీఎస్ ప్రసాద్‌తో తొలి టికెట్ దక్కించుకున్న గుర్రం కృష్ణ మెగా అభిమాన సంఘాల నాయకులు నల్లా చిట్టిబాబు, యేడిద శ్రీను, నల్లా నాయుడు, కార్యదర్శి పుద్దిశ చిన్ని, ట్రెజరర్ ముద్రగడ దొరబాబు, గుబ్బల శేఖర్, సంసాని రవి, మామిళ్ళపల్లి పండు మరియు అభిమానులు, జనసైనికులు పాల్గొన్నారు.

వైసీపీ సీఈసీ సభ్యుడిగా పితాని

విశాలాంధ్ర - కాట్రేనికోన : వైసీపీ సెంట్రల్ ఎక్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ) సభ్యుడిగా పార్టీ ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణను నియమించారు. తనకు అవకాశం కల్పించిన వైసీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, ఉమ్మడి గోదావరి జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, ఎంపీ మిథున్‌రెడ్డిలకు పితాని కృతజ్ఞతలు తెలిపారు.

వెండి కిరీటం వితరణ

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురంపట్నం కౌండిన్యనగర్ కోదండరామ ఆంజనేయస్వామి విగ్రహానికి భక్తులు సమర్పిం చిన లక్ష యాభై వేల విలువగల వెండి కిరీటం శుక్రవారం స్వామివారికి అలం కరించారు. మామిడికుదురు మండలం మగటపల్లి గ్రామా నికి చెందిన వర్దనీడి త్రినాధరావు ఉమా మహేశ్వరి దంపతులు ఒక లక్ష ఐదు వేలు, ఆలయ కమిటీ సభ్యులు 40 వేల నిధులతో వెండికిరీటం రూపకల్పన చేశారు. వర్దనీడి త్రినాధరావు తల్లిదండ్రులు వినాయ కరావు, శేషవాణి అమలాపురం శ్రీ వెంకటేశ్వర దేవస్థానం అర్చకులు అబ్బి ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించి, స్వామి వారికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో కుడిపూడి వెంకట శ్రీనివాస్ నాగమణి దంపతులు. కుడిపూడి త్రినాధ రావు, మట్టపర్తి కృష్ణనాగేంద్ర, గుత్తుల సుబ్రహ్మణ్యం, ప్రసాద్ రెడ్డి, కేశవదాసు రాంబాబు, తురగా చిన్ని, కుడిపూడి గోవింద్, వాసంశెట్టి చిన్న, మట్టపర్తి నాగ భవాని, కవురు బ్రహ్మానందం, కుడిపూడి దుర్గాదేవి, అర్చకులు పాల్గొన్నారు.

బాణాసంచా దుకాణాల తనిఖీలు

విశాలాంధ్ర - గొల్లప్రోలు : దీపావళి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో గొల్లప్రోలు బాణాసంచా తయారీ కేంద్రాలను శుక్రవారం పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తయారీ కేంద్రాల అనుమతి పత్రాలను సేఫ్టీ యంత్రాలను పరిశీలించారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా బాణాసంచా తయారు చేయడం అమ్మకాలు చేయడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. బాణాసంచా తయారీ కేంద్రాల వద్ద నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలన్నారు.

శారదా రామకృష్ణ సేవా సమితి అన్నదానం

విశాలాంధ - గండేపల్లి : సామర్లకోట మండలం పిబి దేవం గ్రామంలో శారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో 66వ వార్షిక శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 11వ రోజు విజయ దశమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ తెలిపారు. ఉత్సవాలలో చివరి రోజున పూర్ణాహుతి మహాన్నదానం నిర్వహించారు. భక్తులు, మహిళలు అన్న ప్రసాదం స్వీకరించారు. సమితి గౌరవ అధ్యక్షుడు వింజమూరి సుబ్రహ్మణ్య శర్మ,కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్, సభ్యులు టీవివి సత్యనారాయణ, నువ్వుల వెంకటరాజు, బాబ్జి, సూర్య చంద్రరావు, తోటకూర నారాయణరావు, టి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

నిధుల గోల్‌మాల్‌పై విచారణ

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం కొవ్వూరు మండలం వేములూరు గ్రామ సచివాలయం అవినీతికి అడ్డాగా మారిందని నిధులు గోల్‌మాల్ అయ్యాయని వార్డ్ సభ్యులు, గ్రామస్తులు గత నెల 16న శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావుకి ఫిర్యాదు చేశారు. శాసన సభ్యులు ఉన్నత అధికారులకు విచారణకు ఆదేశించారు. దీంతో శుక్రవారం వేములూరు సచివాలయంలో నిధులు అవకతవకలపై కార్యదర్శి మద్దుల వెంకటేష్‌పై ఈవోపిఆర్‌డి ప్రకాష్ ఇద్దరు కార్యదర్శులు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. సర్పంచ్, వార్డ్ సభ్యులు గ్రామస్తులు సమక్షంలో విచారణ జరిగింది. వార్డు సభ్యులు మాట్లాడుతూ 2023-2024 -2025 ఆర్థిక సంవత్సరంలో నిధులు సెంట్రల్ గవర్నమెంట్ నిధులు ఓన్ ఫండ్స్ నిధులు కలిపి కోటి రూపాయలు జమ ఖర్చుల మీద పాలకవర్గ సభ్యులు కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. వార్డు సభ్యులు మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామంలో చేసిన పనుల విషయంలో ఎన్నో అవకతవకలు ఉన్నాయని, నిధులు దుర్వినియోగం అయ్యాయని, పంచాయతీ కార్యదర్శి సభ్యులను పక్కదారి పట్టిస్తూ కొంతమంది వ్యక్తులతో చేతులు కలిపి ప్రజా ధనం దుర్వినియోగం చేశారని సమావేశాలు నిర్వహిస్తున్నారు. కానీ నిధులకు సంబంధించిన ఊసు మాత్రం సమావేశంలో ఎప్పుడూ చెప్పడం లేదన్నారు. ఇదే విషయమై ఇటీవల జరిగిన సమావేశంలో గట్టిగా కార్యదర్శిని అడగగా ఏ విధమైన సమాధానం చెప్పకపోవడం, పంచాయతీ ద్వారా చేసిన పనులకు సరైన బిల్లులు లేవని విచారణ చేపట్టాలని వారు తెలియజేశారు. ఈవోపిఆర్‌డి ప్రకాష్ మాట్లాడు తూ విచారణ చేపట్టి ఉన్నత అధికారులకు నివేదిక సమర్పిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములూరు సర్పంచ్ ఆరేపల్లి శ్రీనివాస్, వార్డు సభ్యులు ఎల్ఐసి సత్యనారాయణ, రెడ్డి అనంతలక్ష్మి ,తుమ్మిడి రామలక్ష్మి, బాబాల లక్ష్మి, మట్ట వెంకటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు మొబైల్ యంత్రం ప్రారంభం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో రోడ్డు మరమ్మతులు చేసేందుకు వీలుగా రూ.1.48 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన ఇన్‌ఫ్రారెడ్ రీసైక్లింగ్ గుంతలు, రోడ్ మరమ్మతు మొబైల్ యంత్రాన్ని శుక్రవారం డీఎంహెచ్ఓ కార్యాలయం రోడ్డులో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు, కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, శాసనమండలి సభ్యులు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, కాకినాడ పట్టణం ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా యంత్రం పనితీరును పరిశీలించారు. రోడ్ ప్యాచ్ పనుల కోసం ఇన్ఫ్రారెడ్ రీసైక్లింగ్ గుంతలు, రోడ్ మరమ్మతు మొబైల్ యంత్రం ద్వారా ప్రమాదకరమైన గుంతలను కేవలం 30 నిమిషాల వ్యవధిలో మరమ్మత్తు చేయబడుతుంది. కార్యక్రమంలో జేసీ రాహుల్ మీనా, కాకినాడ నగరపరక సంస్థ అదనపు కమిషనర్ కేవీ సుధాకర్, ఎస్ఈ వెంకటరావు, ఎంహెచ్ఓ డా పృధ్వీ చరణ్ ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్నారావుకు సత్కారం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : కొత్తపల్లి మండలం వాకతిప్ప గ్రామానికి చెందిన రావు చిన్నారావు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కొత్తపల్లి మండలం వాకతిప్పలో ఉన్న తన కార్యాలయంలో శుక్రవారం మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో రావు చిన్నారావుని పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి, పిఠాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ వంగా గీత విశ్వనాథులకు తమపై ఉన్న నమ్మకంతో మెంబర్‌గా నియమించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాలాని దొరబాబు, గోపి హరిబాబు, పొన్నగంటి రామకృష్ణ, దున్న చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఆర్థిక ప్రయోజనాలు

విశాలాంధ్ర - కాకినాడ : పేద, మధ్యతరగతి ప్రజలు వినియోగించే వస్తువులపై ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ వల్ల చేకూరుతున్న లాభాల గురించి ప్రజలందరికీ అవగాహన కల్పించి సేవింగ్స్, ఆర్థిక ప్రయోజనాలను సమగ్రంగా పొందేలా చైతన్యపరచాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి కోరారు. ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా తగ్గించిన జీఎస్టీ స్లాబ్‌ల ద్వారా వివిధ వర్గాల, రంగాల ప్రజలకు చేకూరుతున్న ఆర్థిక ప్రయోజనాలపై రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అక్టోబరు 19 వరకు జిల్లాలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవార కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జీఎస్టీ తగ్గింపుతో ధరలు గణనీయంగా తగ్గిన వ్యవసాయ, అనుబంధ రంగాల్లో వినియోగించే పనిముట్లు, యంత్రాల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల శ్రీనివాస్, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, కర్రి పద్మశ్రీ, కాకినాడ పట్టణ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జీఎస్టి జాయింట్ కమిషనర్ శ్రీలతతో కలిసి ప్రారంభించారు. ప్రదర్శనలో ఉంచిన వ్యవసాయ పరికరాలు, యంత్రాలను పరిశీలించి వాటిపై జీఎస్టీ తగ్గింపు వల్ల ధరలు ఏమేరకు తగ్గాయో అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రైతులు వినియోగించే వివిధ కంపెనీల ట్రాక్టర్ల ధరలు 40 వేల నుండి లక్షా 50 వేల వరకూ తగ్గడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తూ ఇది వ్యవసాయ రంగానికి, దేశ ప్రగతికి ఎంతో దోహదం చేస్తుందని హర్షం వ్యక్తం చేసారు. అనంతరం కాకినాడ కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో నిర్వహించిన రైతులు, అనుబంధరంగాల వారికి జీఎస్టీ తగ్గింపు గురించి సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అంశంపై వ్యవసాయ, జీఎస్టీ శాఖల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధ్యక్షతన అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ కార్యక్రమాల ద్వారా తగ్గిన జీఎస్టీ శాతాలపై పేద మధ్య తరగతి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆయన అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. వ్యవసాయ యంత్రాలపై గతంలో ఉన్న జిఎస్టిని 12 శాతం నుండి ఐదు శాతంకి తగ్గించడం జరిగిందని తద్వారా రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడి ఆదాయం రెట్టింపు అవుతుందని ఆయన అన్నారు. జీఎస్టీ జాయింట్ కమిషనర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 ద్వారా తగ్గించిన జీఎస్టీ స్లాబులు వల్ల అల్పాదాయ వర్గాలకు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, వ్యాపారులకు కలుతున్న ఆర్థిక ప్రయోజనాలపై గత నెల 26 నుండి అక్టోబరు 19 వరకూ నాలుగు వారాలు పాటు అవగానా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం రాజ్య సభ సభ్యులు సానా సతీష్ బాబు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ తగ్గిస్తూ చేపట్టిన సంస్కరణలు దేశ ప్రగతిలో విప్లవాత్మక మార్పులు ఆవిష్కరించనున్నాయన్నారు. తగ్గిన జీఎస్టీ ప్రయోజనాలు అన్ని వర్గాల, రంగాల ప్రజలకు అందుతాయని ముఖ్యంగా పేద, దిగువ మధ్యతరగతి ప్రజలకు వినియోగ వస్తువులు, నిత్యావసరాలపై నెలకు దాదాపు 2 వేల వరకూ ఆదా అవుతుందని, వారి జీవన ప్రమాణాలు మెరుగౌతాయని హర్షం వ్యక్తం చేసారు. కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల రాష్ట్రంలో ప్రజలకు దాదాపు 8 వేల కోట్ల రూపాయల మేరకు సేవింగ్స్ మిగులుతుందని, 99 శాతం చిన్న, మధ్యతరహా వ్యాపారాలు, పరిశ్రమలు లబ్ధిపొంది మరింత విస్తరిస్తాయని తెలిపారు. జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు ప్రజలకు సక్రమంగా అందేలా నేషనల్ యాంటీ ప్రాఫిటింగ్ కమిటీల్ పర్యవేక్షిస్తాయన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల చిన్న, పెద్ద, పేద, ధనిక తేడాలు లేకుండా ప్రజలందరికీ ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు ప్రసంగిస్తూ జీఎస్టీ తగ్గింపు ద్వారా ఎన్డీఏ ప్రభుత్వం అందించిన సూపర్ సేవింగ్స్ ప్రయోజనాలపై విస్తృత ప్రచారం కల్పించడం ద్వారా అందరూ లబ్ధిపొందేలా చైతన్య పరచాలని కోరారు. ఈ సదస్సులో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జీఎస్టీ డిప్యూటీ కమీషనర్ తోట లలిత, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ విజయకుమార్, వ్యవసాయ, అనుబంధ రంగాల రైతులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డిసిసిబి చైర్మన్ జీఎస్టీ తగ్గింపుతో గణనీయంగా తగ్గిన ధరల బోర్డులు ప్రదర్శించిన ట్రాక్టర్లను నడిపి కలెక్టరేట్ ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు.

ప్రపంచాన్ని మార్చే దీపదారులు ఉపాధ్యాయులు

విశాలాంధ్ర-టి నరసాపురం: ప్రపంచాన్ని మార్చే దీపధారులు ఉపాధ్యాయులు అని బంజారా బజరంగీ భేరీ సంఘం జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ తెలిపారు. కృష్ణా పురం గ్రామంలో బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన లావుడియా సాయి ప్రకాష్, భూక్యా

ఆంజనేయులు, తేజావతు మౌనికలను శుక్రవారం ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా నాగరాజు నాయక్ మాట్లాడుతూ తరగతి నాలుగు గోడల మధ్య విద్యార్థులకు జ్ఞాన బోధ చేసి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే దీపధారులు ఉపాధ్యాయులు అని అన్నారు. అన్ని వృత్తులలో ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని, క్రమశిక్షణ కలిగిన భావి భారత పౌరులను తీర్చి దిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే అని అన్నారు.ఈ కార్యక్రమంలో జరబల కృష్ణ ప్రసాద్, భూక్యా నాగమణి, భూక్యా వేణు గోపాల్, జరబల చందా నాయక్, భూక్యా భిగనాదం, సర్వేశ్వర రావు, ధృత్విక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-టి నరసాపురం: శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయానికి విద్యుత్ వినియోగ దారులు సహకరించాలని జంగారెడ్డిగూడెం ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజినీర్ శ్రీ ఫీర్ అహ్మద్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 4వ తేదీన 33/11కె వి సబ్ స్టేషన్లు టి నరసాపురం, బండి వారి గూడెం పరిధిలోని 11కె వి లైన్ల వెంబడి చెట్లు తొలగింపు,సబ్ సెక్షన్లలో మరమ్మత్తుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు తెలిపారు. విద్యుత్ వినియోగ దారులు విద్యుత్ అంతరాయానికి సహక రించాలని ఆయన కోరారు.

జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు కస్తూరిబా విద్యార్థిని ఎంపిక

విశాలాంధ్ర-ఏలూరు: ఈనెల నాలుగు నుంచి పదవ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్ లో జరిగే జాతీయస్థాయి 50 వ సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలలో స్థానిక కస్తూరిబా మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎస్. సాత్విక

పాల్గొంటుందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని కే. మాధవి లత తెలిపారు. ఈ ఏడాది మే 15 నుంచి 18 వరకు చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి పదవ అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ పోటీలలో సాత్విక మంచి క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని హెచ్ఎం మాధవి లత తెలిపారు. జాతీయస్థాయి పోటీలలో కూడా సాత్విక రాణించాలని పాఠశాల సిబ్బంది ఆకాంక్షించారు. క్రీడాకారిణి సాత్వికకు అత్యుత్తమ శిక్షణను అందించిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మురళీకృష్ణను పాఠశాల ఉపాధ్యాయ , ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.

ఆలయ ప్రతిష్ఠ

విశాలాంధ్ర-లింగపాలెం: కొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన వినాయక స్వామి ఆలయంలో వినాయకుని, లక్ష్మీ దేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. గ్రామానికి చెందిన ప్రముఖ రాజకీయ నాయకుడు కోటగిరి పాపారావు స్వచ్ఛందంగా ఆలయాన్ని, విగ్రహా లను నెలకొల్పారు. ఆలయ ప్రతిష్ఠ

కార్యక్రమంలో ఈయనతో పాటు సర్పంచ్ గుర్రాల కృష్ణకుమారి సత్యనారాయణ దంపతులు,వైసీపీ నాయకుడు గణేష్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఆలయ ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

స్వాతంత్ర్య సమరయోధుల బాటలో యువత నడవాలి

విశాలాంధ్ర - గణపవరం: భారతదేశ స్వాతంత్రం కోసం పోరాడిన మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి నాయకులు గొప్ప చరిత్ర గల వారని రుద్రరాజు ఫౌండేషన్ చైర్మన్, వర్తక సంఘం అధ్యక్షులు రుద్రరాజు వేంకట సూర్యనారాయణ రాజు(ఆర్వి ఎస్ రాజు) అన్నారు.గణపవరం శ్రీ కన్యకా పరమే శ్వరి వర్తక సంఘ భవనం ఆధ్వర్యంలో గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతులను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో సంఘ అధ్యక్షులు ఆర్ వి ఎస్ రాజు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్రం కోసం పోరాడిన పెద్దలను, వారు చేసిన పోరాటాలను మరొకసారి అందరికీ మననం చేస్తూ వారి బాటలో నేటి యువత నడిస్తే భారతదేశం ఇంకా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు వంకా

యల రామారావు, సెక్రటరీ నడిపల్లి రాంపండు, జాయింట్ సెక్రటరీ ఉప్పల నాగేశ్వరరావు, గొర్తి ప్రసాద్, షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న వ్యాపారస్తులు పలువురు పాల్గొన్నారు. అనంతరం అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు.

ఘనంగా విజయదశమి పూజలు

విశాలాంధ్ర-వీరవాసరం: శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు రోజు విజయదశమి పర్వదినం సందర్భంగా మండల వ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆలయాల్లో గురువారం పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అమ్మవారిని శ్రీ రాజరాజేశ్వరి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వీరవాసంలోని శ్రీ కనకదుర్గమ్మ, గండి పోచమ్మ, కోటసత్తెమ్మ, గోగులమ్మ అమ్మవారి ఆలయాలు, తోలేరు శ్రీ ప్రసన్న కనకదుర్గాదేవి ఆలయం, రాయకుదురు, కొనితివాడ, మడుగు పోలవరం, అండలూరు, చింతలకోటి గరువు, మత్స్యపురిపాలెం, మత్స్యపురి, బాలేపల్లి, మెంటేపూడి, దూసనపూడి, పెర్కిపాలెం తదితర గ్రామాల్లో అమ్మవార్ల ఆలయాల వద్ద ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వీరవాసరం పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉన్న సాయిబాబా ఆలయం, పంజా వేమవరం సాయిబాబా ఆలయాల్లో బాబా వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆయా ఆలయాల వద్ద అఖండ అన్న సమారాధన ను ఘనంగా నిర్వహించారు. ఈ అన్న సమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆయా కార్యక్రమాల్లో హిందూ సేన జాతీయ అధ్యక్షులు గోపాలకృష్ణ,అడ్డాల బాబీ, రాయిపల్లి వెంకటేశ్వరరావు, కొడమంచిలి ప్రసాద్, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మూలేశ్వర శతకం ఆడియో -వీడియో ఆవిష్కరణ

విశాలాంధ్ర-వీరవాసరం: రాయకుదురు గ్రామంలో ఉన్న శ్రీ ఉమా మూలేశ్వర స్వామి ఘనతను చాటుతూ 1990లో కీ.శే. వీరభోట్ల సూర్యనారాయణ రచించిన " శ్రీ మూలేశ్వర శతకం "ఈ తరానికి వినసొంపుగా ఉండేలా తయారు చేసిన ఆడియో - వీడియోను దేవాలయంలో ఆవిష్కరణ శు క్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ శతకను 1990లో అప్పటి గ్రామ సర్పంచ్ పెమ్మరాజు కామరాజు, పెమ్మరాజు ఉమామహేశ్వరరావు మంగమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు ముద్రణ చేసి ఆవిష్కరణ చేశారు. ఈ శతకాన్ని గ్రామానికి చెందిన కొమ్మిరెడ్డి శ్రీనివాస్ - శ్రీమతి గీతా కుసుమ కుమారి దంపతుల సొంత ఖర్చులతో శ్రీ మూలేశ్వర శతకం ఆడియో -వీడియో రూపంలోకి తీసుకొని వచ్చారు. 2012లో మన రాయకుదురు గ్రామ చరిత్రను చరిత్రలో మావూరుగా పుస్తకం రచించిన డాక్టర్ అడబాల లక్ష్మీనారాయణ (రాజు) ఆధ్వర్యంలో ఆడియో ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్

గెద్దం భారతి, ఆలయ ఈవో కొండవీటి రామచంద్రరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు అడ్డాల రాము, ఎంపిటిసి కడలి నెహ్రూ, రాయకుదురు విశాల సహకార పరపతి సంఘం అధ్యక్షులు తోట విజయకుమార్ (బుజ్జి), మాజీ జడ్పిటిసి, వీరవాసరం లయన్స్ క్లబ్ అధ్యక్షులు పోలిశెట్టి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కౌరు భాస్కరరావు, సొసైటీ మాజీ అధ్యక్షులు ఆకుల బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు కలిగించే జీఎస్టీ

విశాలాంధ్ర - కలిదిండి: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తగ్గించిన జిఎస్టి వల్ల ప్రజలకు మేలు కలుగుతుందని టిడిపి మండల అధ్యక్షులు పోకల జోగిరాజు తెలిపారు. శుక్రవారం టిడిపి ఆధ్వర్యంలో

కలిదిండి సెంటర్‌లో ఉన్న పలు షాపులకు వెళ్లి కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ తగ్గుదల వల్ల కలుగు ఉపయోగాలను ప్రజలకు వివరించారు. కిరాణా సామాగ్రి, నిత్యవసర వస్తువులు, ఆరోగ్యం జీవిత బీమా, దుస్తులు, పాదరక్షలు, మందులు, స్టేషనరీ తదితర వస్తువులపై తగ్గిన జిఎస్టి గురించి ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ తెలుగుదేశం పార్టీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, సున్న రమాదేవి, అస్లాం, తట్టిగోళ్ళ నాంచారయ్య, పులి వెంకన్న, రామ్ తుల్లా తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీకి నివాళి

విశాలాంధ్ర-పాలకోడేరు : మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని పాలకోడేరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వి. రెడ్డియ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీకి పూల మాలలు వేసి నివాళులు

అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింసే ఆయుధంగా స్వాతంత్ర్య పోరాటంలో జాతిపిత మహాత్మాగాంధీ చేసిన సేవలు అనిర్వచనీయ మన్నారు. ఈ కార్యక్రమంలో ఇ.ఓ.పి. అండ్ ఆర్.డి రాంప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి పెనుమత్స వెంకట శివ నాగరాజు, ఇతర అధికారులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : దేశానికి స్వాతంత్య్రం సాధనలో అహింసా మార్గం సత్యాగ్రహం గాంధీజీ ప్రాముఖ్యత చూపించారని బిజెపి జిల్లా నాయకులు చాట్రాతి ప్రసాదు అన్నారు. గాంధీ జయంతి ,లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా జీలుగుమిల్లి జడ్పీ హైస్కూల్లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు గుద్ద రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి ప్రసాదు, బిజెపి వైస్ ప్రెసిడెంట్ భీమిరెడ్డి సత్య వర ప్రసాదు రెడ్డి, మండల కార్యదర్శి ఎం.లక్ష్మణ్, మండల నాయకులు పులగం సుబ్బారెడ్డి, కేతిరెడ్డి నెహ్రూ రెడ్డి ,అలవాల కోటిరెడ్డి, సోమిరెడ్డి, కక్కిరాల మురళి, దారా మధు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నార్లు.

శరన్నవరాత్రి వేడుకలు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : శ్రీ కనకదుర్గ అమ్మవారు ప్రజలందరినీ ఆయురారోగ్యాతో చల్లగా చూడాలని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ నేత, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు, ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు అన్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి విజయ దుర్గ ఆలయ కమిటీ వారికి ఐదు వేలు విరాళం అందజేశారు. అన్నవరం గ్రామంలో దేవీ శరన్న నవరాత్రులు, చిన్న రావి చెట్టు సెంటర్‌లో పురగిరిక్షత్రియుల రామాలయంలో ఎంపీటీసీ కొండి సతీష్ ఆధ్వర్యంలో దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్న మురళి రాజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న సమారాధన కార్యక్రమంకు రూ.5 వేలు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో అన్నవరం ఎంపీటీసీ దడాల సతీష్, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు కొండపల్లి అప్పారావు, మాజీ వార్డు మెంబర్లు పలివెల కొండలరావు, గంపల సత్తిబాబు, బలువు బాబీ, గంపల శివ, ఎం. అశోక్, మదన పవన్, కిల్లాడ నగేష్, కటకం ప్రసాదు, అభిరుచి శీను, కోలా తాతబాబు తదితరులు పాల్గొన్నారు.